
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025



శ్మశాన స్థలం కబ్జా!

మూడు ఎకరాలు ఆక్రమించి చెరువు తవ్వకం

పెదన మండలం జింజేరు పరిధిలోని గౌడపాలెంలో అక్రమార్కులు బరి తెగించారు. పది మందికి ఉపయోగపడే శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారు. మూడు ఎకరాల్లో ఏకంగా రొయ్య చెరువు తవ్వేశారు. దాని పక్కనే ఉన్న పీడబ్ల్యూడీ భూములు మరో మూడు ఎకరాలను ఆక్రమించేశారు. ఇక్కడ చెరువును తవ్వి రొయ్యల సాగు ఆరంభించారు. మిగిలిన శ్మశాన వాటిక స్థలంపైన కన్నేశారు. ఇదేంటని ప్రశ్నించిన గ్రామస్థులపై బెదిరింపులకు దిగుతున్నారు. వీరికి రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెదన మండలం జింజేరు శివారు గౌడపాలెంలో అక్రమార్కుల దుశ్చర్య

- మరో మూడు ఎకరాలు పీడబ్ల్యూడీ భూములు కూడా కబ్జా
- మడ చెట్లను నరికి.. చెరువు తవ్వి యథేచ్ఛగా రొయ్యల సాగు
- ప్రశ్నించిన గ్రామస్థులకు బెదిరింపులు
- మిగిలిన శ్మశాన స్థలంపైనా అక్రమార్కుల కన్ను
- వీరికి రెవెన్యూ అధికారుల అండ!

రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో..

శ్మశాన స్థలం, పీడబ్ల్యూడీ భూముల ఆక్రమణ వెనుక స్థానిక రెవెన్యూ అధికారుల హస్తం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే జింజేరు పరిధిలోని ఆక్రమిత పీడబ్ల్యూడీ భూములకు రెవెన్యూ అధికారులు కొంతమందికి పట్టాలు ఇవ్వటంపై ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు కూడా అందాయి. కలెక్టర్ బాలాజీ ఆ దిశగా ఇంకా చర్యలు చేపట్టలేదు.





శ్మశాన స్థలంలో తవ్విన చెరువు (ఇన్‌సెట్‌లో) పీడబ్ల్యూడీ భూముల్లో చెరువు తవ్వి రొయ్యల సాగు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం): పెడన మండలం జింజేరు గ్రామ పరిధిలోని గౌడపాలెంలో హిందూ శ్మశాన వాటికకు ఏడు ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూముల్లో 30 సెంట్ల విస్తీర్ణంలో శ్మశానం ఉంది. ఈ శ్మశాన భూములను ఆనుకుని పీడబ్ల్యూడీ భూములు కూడా ఉన్నాయి. జింజేరులో లజ్జబండ డ్రెయిన్ వెంబడి ఈ పీడబ్ల్యూడీ భూములు ఉన్నాయి. వీటిని ఇప్పటికే చాలా వరకు అక్రమార్కులు ఆక్రమించేశారు. మడ చెట్లు కలిగిన భూములను కూడా అక్రమార్కులు చెరపట్టారు. మడచెట్లను నరికివేస్తూ ఆ భూముల్లో రొయ్యల చెరువులను తవ్వారు. ఇలా జింజేరులో 200 ఎకరాల మేర మడ చెట్లు కలిగిన పీడబ్ల్యూడీ భూములలో 125 ఎకరాల మేర నరికేసి రొయ్యల చెరువులు సాగు చేశారు. రొయ్యల సాగు ద్వారా భారీ లాభాలను ఆర్జిస్తుండటంతో అక్రమార్కులు ఈ ప్రాంతంలో కనిపించే ఏ భూములను కూడా వదలటం లేదు. ఈ క్రమంలోనే గౌడపేటలోని సర్వే నెంబర్ 5-10లోని హిందూ శ్మశాన స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. హిందూ శ్మశాన స్థలానికి మొత్తం ఏడు ఎకరాలు భూములున్నా వాటిని రక్షించుకోవటానికి కంచె వంటి ఏర్పాట్లు కూడా చేయలేదు. దీనిని అదనుగా చేసుకుని శ్మశాన స్థలంలో మూడు ఎకరాల భూములను, ఈ భూములకు అభిముఖంగా ఉన్న పీడబ్ల్యూడీ భూముల్లో మరో మూడు ఎకరాలను ఆక్రమించారు. మొత్తంగా ఆరు ఎకరాల్లో మూడు ఎకరాలకు ఒకటి చొప్పున రెండు రొయ్యల చెరువులను తవ్వారు. ఈ రెండు చెరువులకు మధ్యలో దారి వదిలారు. రెండు చెరువుల గట్టుగా ఈ దారి ఉంటుంది. ఈ దారి మీదుగానే శ్మశానానికి వెళుతున్నారు. గ్రామస్థులు ఈ ఆక్రమణల గురించి ప్రశ్నిస్తే అధికారం అండ కలిగిన అక్రమార్కులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సమాచారం.

కాపలా పెట్టి మరీ రొయ్యల సాగు

అక్రమార్కులు ఆక్రమించిన పీడబ్ల్యూడీ భూములు మూడు ఎకరాలలో చెరువును తవ్వి.. రొయ్యల సాగు చేపట్టారు. ఈ చెరువుకు కాపలాదారుడిని కూడా పెట్టారు. అతని కుటుంబం కోసం తాత్కాలికంగా ఒక షెడ్ కూడా వేశారు. రొయ్యలకు మేత వంటివి కాపలా కుటుంబమే చూసుకుంటుంది. ఆక్రమణదారులు అప్పుడప్పుడు వచ్చి చెరువును చూసుకుని వెళుతున్నారు. శ్మశానం స్థలంలో ఆక్రమించుకున్న మూడు ఎకరాలలో చెరువు తవ్వినప్పటికీ ఇంకా రొయ్యల సాగు చేపట్టలేదు. రొయ్యల సాగు కోసం చెరువులో నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నీటిని నింపిన తర్వాత రెండో చెరువులో కూడా రొయ్యలను సాగు చేయనున్నారు.

మిగిలిన శ్మశాన స్థలంపైనా కన్ను

శ్మశానానికి సంబంధించి ఇంకా మూడున్నర ఎకరాలు ఉండటంతో.. అక్రమార్కులు వాటిపైనా కన్ను వేశారు. ఈ మూడు ఎకరాలను కూడా చెరువు తవ్వాలని ప్లాన్ చేసినట్టు సమాచారం. వెంటవెంటనే చెరువులను తవ్వవద్దని స్థానిక రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు సూచించటంతో తాత్కాలికంగా ఆగారని తెలిసింది. లేదంటే ఈ పాటికే మూడో చెరువు ఏర్పాటయ్యేదని, రానున్న రోజుల్లో మిగులు శ్మశాన స్థలం కూడా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.



ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు (ఇన్‌సెట్‌లో) నిందితుడు గోపాల్ సింగ్

ఎంపీ బాలశౌరి పీఏ మోసంపై బాధితుల ధర్నా

ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు వసూలు చేసిన గోపాల్ సింగ్

- డబ్బు కట్టిన వారికి నకిలీ నియామక పత్రాలు అందజేత
- నేను చెప్పినప్పుడు ఆయా ఆఫీసులకు వెళ్లి ఉద్యోగంలో చేరాలని మెలిక
- పలువురు అభ్యర్థులు నిలదీయడంతో విజయవాడలోని హోటల్‌కు రావాలని చెప్పి పత్తాలేకుండా పరార్
- మీకు డబ్బులు ఇప్పిస్తామని బందరు రావాలని మరో ఉద్యోగి పిలుపు
- వచ్చిన తర్వాత మా వల్ల కాదంటూ పోలీస్ కేసు పెట్టుకోవాలని సలహా
- దీంతో ఎంపీ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన
- ఉద్యోగాలు వద్దు.. కట్టిన డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్
- పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ధర్నా విరమణ

మచిలీపట్నం జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేయడంపై బాధితులు శనివారం ధర్నాకు దిగారు. మచిలీపట్నం మెడికల్ కళాశాల, కృష్ణా యూనివర్సిటీ, విద్యుత్ సబ్‌స్టేషన్‌లల్లో ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు గోపాల్ సింగ్ వసూలు చేశాడని ఆరోపించారు. తమకు ఉద్యోగాలు వద్దు.. కట్టిన డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరికి మచిలీపట్నంలో కార్యాలయం ఉంది. అక్కడ గోపాల్ సింగ్ అనే వ్యక్తి చాలాకాలంగా పనిచేస్తున్నాడు. ఎంపీ కార్యాలయానికి వచ్చేవారితో పరిచయాలు పెంచుకున్నాడు. ఎంపీ సిఫార్సు చేస్తే మిగతా 6లో..

గోపాల్‌సింగ్ ఎంపీ పీఏగా పనిచేయడం లేదు

- జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో నకిలీ నియామక పత్రాలు సృష్టించి ఇచ్చిన గోపాల్‌సింగ్ ఎంపీ వల్లభనేని బాలశౌరి పీఏ కాదని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. శనివారం జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అవనిగడ్డ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలిప్పిస్తామని గోపాల్ సింగ్ చేసిన మోసంపై ఎంపీ వల్లభనేని బాలశౌరి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఇప్పటికే గరికపాటి సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో గోపాల్‌సింగ్‌పై కేసు నమోదు చేశారన్నారు.

పింగళి వెంకయ్య దేశభక్తి స్ఫూర్తిదాయకం 8
- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

రైతుకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం 6
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి 6
- పత్తాలేని 108 అంబులెన్స్
- రక్షించేందుకు స్నేహితుల ఆరాటం

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలుతో ప్రతిపక్షాల్లో వణుకు 6
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి

ఆ 4 కిలోమీటర్ల విస్తరణకు ఓకే

పున్నమి ఘాట్ వరకు హైదరాబాద్-విజయవాడ 6 వరుసల విస్తరణ

- నాలుగు కిలోమీటర్లు పొడిగించేందుకు ఆదేశాలు ఇచ్చిన గడ్కరీ
- ఫలించిన విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృషి
- ఓఆర్ఆర్‌కే పరిమితమైన విస్తరణ.. తొలుత గొల్లపూడి వరకూ..
- తాజాగా పున్నమి ఘాట్ వరకూ తీసుకొచ్చిన ఘనత
- విజయవాడ-మచిలీపట్నం 6 వరుసల విస్తరణకు గ్రీన్‌సిగ్నల్
- ఎన్‌హెచ్-30పై ఆర్‌వోబీ నిర్మాణానికి శుంకుస్థాపన

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) ఆరు వరుసల విస్తరణ పనులను పున్నమి ఘాట్ వరకు పొడిగించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర పర్యటనలో ఉన్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ.. ఎంపీ కేశినేని చిన్నికి తెలియజేశారు. ఈ జాతీయ రహదారి విస్తరణను పున్నమి ఘాట్ వరకూ పెంచేందుకు ఎంపీ చిన్ని చాలారోజుల నుంచి చేస్తున్న ప్రయత్నాలకు ఇప్పటికి పరిష్కారం లభించింది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) ఆరు వరుసల విస్తరణ పనులను కేవలం అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) వరకు సరిపెట్టాలని తెలంగాణా ఎన్‌హెచ్ అధికారులు భావించారు. ఈ ప్రతిపాదనను చివరి నిమిషంలో తెలుసుకున్న ఎంపీ కేశినేని చిన్ని నెల కిందట నగరంలో ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ నుంచి గొల్లపూడి, విజయవాడ బైపాస్‌కు అనుసంధానమయ్యే వరకు ఆరు వరుసలను విస్తరించాలని పట్టుబట్టారు. దీంతో తెలంగాణా ఎన్‌హెచ్ అధికారులు దిగొచ్చారు. గొల్లపూడి వరకు పొడిగిస్తున్నట్టుగా ప్రకటించారు.

ట్రాఫిక్ సమస్య తీరినట్టే..

గొల్లపూడి నుంచి కనకదుర్గ ఫ్లై ఓవర్ వరకు ఎన్‌హెచ్-65 నాలుగు వరసలుగానే ఉంటుంది. ఈ ప్రాంతంలో విపరీతమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తొలుత గొల్లపూడి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ఎంపీ కేశినేని చిన్ని పార్లమెంట్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లినపుడు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి ఈ సమస్యను వివరించారు. గొల్లపూడి నుంచి పున్నమి ఘాట్ వరకు జాతీయ రహదారిని విస్తరిస్తే సమస్యలే ఉండవని, విజయవాడ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని వివరించారు. దీనిపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు. శనివారం ఆయన రాష్ట్రానికి వచ్చి మంగళగిరిలో నిర్వహించిన పలు ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొనగా, మరోమారు సమస్యను గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం మిగతా 6లో..

విజయవాడ-మచిలీపట్నం ఆరు వరుసలకు ఓకే..

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి ఎన్‌హెచ్-65ను కూడా ఆరు వరసలుగా విస్తరించేందుకు గడ్కరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మచిలీపట్నం పోర్టును దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణ అంశంపై ఎన్‌హెచ్ అధికారులు డీపీఆర్ తయారు చేయించారు. చైతన్య కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్ తయారు చేసి ఎన్‌హెచ్ అధికారులకు సమర్పించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కూడా ఆరు వరసలుగా విస్తరించటానికి కేంద్రమంత్రి గడ్కరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో త్వరలో పనులు జరగనున్నాయి. మచిలీపట్నం నుంచి కానూరు వరకు ఆరు వరసలుగా విస్తరిస్తారు.

దసరాకు టెక్ బందోబస్తు



అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

- మహామండపంలో శాశ్వతంగా 'కమాండ్'
- సొంతంగా ఏర్పాటు చేసే యోచనలో దుర్గగుడి అధికారులు
- ఈ ఏడాది రెండు భారీ కమాండ్ కంట్రోల్ సెంటర్లు
- మూలా నక్షత్రం నుంచి గగన నిఘా నిరంతరం
- బందోబస్తుకు 'ఈ' డిప్లాయ్‌మెంట్ యాప్



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో బందోబస్తును ఈసారి సాంకేతిక మార్గంలో ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గడచిన ఏడాది ఎదురైన అనుభవాలు, జరిగిన తప్పొప్పులను బేరీజు వేసుకుని పోలీసువరంగా టెక్నాలజీ ఉపయోగించి బందోబస్తును ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ముందు వరుసలో ఉన్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని కొద్దిరోజుల క్రితం డీజీపీ స్వయంగా ప్రకటించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులకు సమానమని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో సుమారుగా 7వేల సీసీ కెమెరాలు ఉన్నాయి. శరన్నవ రాత్రుల బందోబస్తుకు మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

సరికొత్త విధానంతో ముందుకు..

ఈ ఏడాది శరన్నవరాత్రుల్లో పోలీసులు ఈ డిప్లాయ్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం ఒక యాప్‌ను ఇప్పటికే తయారు చేశారు. శరన్నవరాత్రులకే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి భారీ కార్యక్రమం జరిగినా బందోబస్తుకు ఉపయోగించే సిబ్బంది కోసం దీన్ని తయారు చేస్తున్నారు. గడచిన ఏడాది శరన్నవరాత్రుల్లో ఐదు వేల మందితో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది అదే స్థాయిలో వినియోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. శరన్నవరాత్రుల్లో బందోబస్తు విధులకు వివిధ జిల్లాల నుంచి సిబ్బందిని రప్పిస్తారు. ఇది కాకుండా బెటాలియన్లలో ఉన్న సిబ్బందిని బందోబస్తుకు నియమిస్తారు. వాళ్లంతా శరన్నవరాత్రులు ప్రారంభానికి ముందు విజయవాడ చేరుకుని అధికారులకు రిపోర్టు చేస్తారు. ఆ సెక్టర్ ఇన్‌చార్జిలు వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి విధులు నిర్వహించే ప్రదేశాన్ని కేటాయించేవారు. దీనికి సమయం ఎక్కువ పడుతున్నందున ఈ డిప్లాయ్‌మెంట్ యాప్ ద్వారా బందోబస్తుకు వచ్చే వారికి సెల్‌ఫోన్‌కు సమాచారం వెళ్తుంది. విధులు ఏ ప్రదేశంలో నిర్వహించాలో అందులోనే ఉంటుంది. అధికారులు జారీ చేసే పాస్ డిజిటల్‌గా చేరుతుంది. దీంతో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది నేరుగా కేటాయించే మిగతా 6లో..



ఒంటరైనా.. ఓటమైనా!
- స్నేహితులు తోడుంటే ఎంతటి శోక సంద్రమైనా దాటేయొచ్చు
- నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

8

131 పీఏసీఎస్‌ల్లో త్రీమెన్ కమిటీల పదవీ కాలం పొడిగింపు

మచిలీపట్నం, ఆగసు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 131 పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం)ల్లో త్రీమెన్ కమిటీల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే ఈ కమిటీలను కూటమి ప్రభుత్వం నియమించింది. ఆ సమయంలో జూలై 30 వరకు పదవీ కాలం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. తాజాగా ఈ కమిటీల పదవీ కాలాన్ని 2026, జనవరి 30 వరకు పొడిగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలుకుతున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఘనస్వాగతం

గన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు విచ్చేస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో శనివారం గన్నవరం విమానాశ్రయానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేరుకుని రోడ్డు మార్గంలో అమరావతిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం తదితరులు పుష్ప గుచ్ఛం అందజేశారు. ఘనస్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

రైతుకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : భారతదేశానికి రైతే వెన్నుముక అని, రైతులకు పెట్టుబడి సాయం అందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటున్నాయని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లనారాయణరావు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన 7,526 రైతు కుటుంబాలకు రూ.5.21 కోట్ల రూపాయల మెగా బ్యాంకు చెక్కును ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల రైతులకు అందజేశారు. కొనకళ్ల మాట్లాడుతూ, దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రైతులు బాగుండాలన్నారు. మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని కొనియాడారు. గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీ మణిదర్, ఏవో హారిక, శేషగిరి, తిమోతి రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఆందోళనలో పాల్గొన్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పొద్దు

● ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ అంబటిపూడి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నం ధర్నా చౌక్ వద్ద జరిగిన ఆందోళనలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయులకు పనిభారం పెరుగుతోందని సుబ్రహ్మణ్యం అన్నారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ కె. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎస్టీయు రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి కె.విజయ, జిల్లా కో చైర్మన్ ఎం. రాజేష్, యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కనకారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, జిల్లా కో చైర్మన్ బి. అశోక్‌కుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె. నాగసోమేశ్వరమ్మ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. ఇమ్మానుయేల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు గంగాధరరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషగిరి, శివరామకృష్ణ, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



టీ తాగుతూ సమస్యలపై ఉద్యోగులతో చర్చిస్తున్న సంఘం అధ్యక్షుడు పి.రాము, కార్యదర్శి తోట వరప్రసాద్

ఉద్యోగుల సమస్యలపై ఆందోళన 5న

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పీఆర్సీ, డీఏ బకాయిల అంశంపై జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి. రాము శనివారం ఉద్యోగులతో చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో టీ తాగుతూ మాట్లాడుకుందాం రా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై చర్చించారు. ఉద్యమాన్ని ఎటు తీసుకెళ్లాలో కార్యవర్గ సభ్యులు సూచించారు. ఆగస్టు 5వ తేదీన జరిగే ఉద్యమంలో పాల్గొనాలని రాము పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. రాంబాబు, వైస్ ప్రెసిడెంట్లు రామారావు, బి. శ్రీనివాసరావు, ఎండి నలీం, సిహెచ్‌ఎస్ఆర్ పవన్‌కుమార్, హుస్సేన్, కె. లోకేష్, కె. వెంకటేశ్వరరావు, బి. సత్యనారాయణ, ఎం. వీరబాబు, రమేష్‌బాబు, జి. రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, పరమేశ్వరరావు, జగన్‌మోహనరావు, శ్రీకాంత్, అబ్బాస్ పాల్గొన్నారు.

పాత ఎడ్లంకను వీడని కాజ్‌వే కష్టాలు

(అవనిగడ్డ రూరల్-ఆంధ్రజ్యోతి)

పాత ఎడ్లంకకు కృష్ణానదిపై వంతెన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉంది. పాత ఎడ్లంకకు వంతెన నిర్మిస్తామని గత పాలకులతోపాటు ప్రస్తుత పాలకులు సైతం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న వల్లభనేని బాలశౌరి, నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణం అతీగతీ లేదు. ఎన్నికలు జరిగిన తర్వాత అదే బాలశౌరి జనసేన పార్టీ నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా మండలి బుద్ధప్రసాద్ విజయవంతం సాధించారు. ఎన్నికల తరుణంలో పాత ఎడ్లంకకు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.2.50 లక్షలతో తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించారు. ప్రస్తుతం వరద కారణంగా అది పూర్తిగా ధ్వంసం కావటంతో పాత ఎడ్లంక ప్రజల పరిస్థితి యథాస్థితికి చేరింది. పాలకులు హామీలిస్తున్నారు కానీ అమలు చేయటం లేదని ప్రజలు వాపోతున్నారు. పాలకులు స్పందించి పాత ఎడ్లంకకు వంతెన నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పాత ఎడ్లంక వద్ద వరదకు కొట్టుకుపోయిన కాజ్‌వే

ఆడుదాం ఆంధ్ర.. అంతా అవినీతే

● ఆర్డీవోలు, ఎంపీడీవోల ఖాతాకు నిధులు జమ ● ఖర్చు దాతల నుంచి వసూలు ● ఎంపీడీవోలకు జమ అయిన నిధుల మాయం

క్రీడలను ప్రోత్సహించే పేరుతో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఆడుదాం..ఆంధ్రలోనూ నిధుల దుర్వినియోగం జరిగింది. అప్పటి జగన్ ప్రభుత్వం క్రీడల నిర్వహణకు ఆర్డీవో, ఎంపీడీవోల ఖాతాలకు నిధులు జమ చేసింది. అంతంత మాత్రం నిధులతో పోటీలు నిర్వహించలేక అధికారులు దాతల నుంచి కొంత వసూలు చేశారు. ఆ నిధులు చాలకపోవడంతో వైసీపీ ప్రభుత్వం క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.250 చొప్పున నిధులు మంజూరు చేసి ఎంపీడీవోల ఖాతాకు జమ చేసింది. అప్పటికి ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. ఆ తర్వాత నిధులు మాయమయ్యాయి.



నందిగామలో ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ(ఫైల్)

(నందిగామ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలలో ఆడుదాం ఆంధ్రా పేరుతో నిర్వహించిన క్రీడలపోటీల్లోనూ నిధుల దోపిడీ జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఆడు దాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించింది. 2024 డిసెంబర్, జనవరి నెలలో కూడా క్రీడలు నిర్వహించింది. తొలుత మండల స్థాయి క్రీడల నిర్వహణకు ఒక్కొక్క ఎంపీడీవో ఖాతాకు రూ.25 వేలు జమ చేసింది. ఆ మొత్తంతో పాటు దాతల సహకారం తీసుకొని ఎంపీడీవో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల స్థాయిలో క్రీడల నిర్వహణకు ఆర్డీవో ఖాతాకు రూ.50 వేలను వైసీపీ ప్రభుత్వం జమ చేసింది. అదే తీరున నందిగామ, జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్ల పేరుతో చెరొక రూ.25 వేల చొప్పున జమ చేసింది. అప్పటి ఆర్డీవో తనకు వచ్చిన నిధుల నుంచి వాటా ప్రకారం నందిగామ నియోజకవర్గానికి విడుదలైన రూ.25 వేలను కమిషనర్‌కు అందజేశారు. మొత్తం రూ.50 వేలతో క్రీడలు నిర్వహించిన కమిషనర్ కనీస ఏర్పాట్లు కూడా చేయలేదు. దీంతో క్రీడాకారులతో పాటు నిర్వహణకు వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం టీ కూడా ఇప్పించని స్థితిలో అప్పటి క్రీడలు జరిగాయి.

నిధులు డ్రా చేసిందెవరు?

క్రీడలు జరిగిన సమయంలో ఉన్న ఎంపీడీవో దాతల వద్ద సొమ్ము వసూలు చేసి భోజనం, తదితర ఏర్పాట్లు చేశారు. కనీసం ఆయన ఉండి ఉంటే ఆ నిధులను డ్రా చేసి దాతలకు తిరిగి ఇచ్చారనుకోవచ్చు. నిధులు విడుదలైన సమయంలో గానీ, డ్రా చేసిన సమయంలో గానీ ఆయన ఇక్కడ లేరు. మరి ఆ మొత్తాన్ని ఎవరు, ఎందుకు డ్రా చేశారో తేలాల్సి ఉంది. దాతల జేబులు ఖాళీ చేసి క్రీడలు నిర్వహించగా, ఏ సంబంధం లేని అధికారులు ఆ సొమ్మును దిగమింగినట్లు తెలియవచ్చింది.

నందిగామ ఎంపీడీవో కార్యాలయంపై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజ లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తైతే ఏకంగా ఖజానా దోపిడీ మరో ఎత్తైంది. దర్జాగా ప్రభుత్వ సొమ్ము స్వాహా చేసిన ఘనులపై విచారణ చేపట్టాల్సి ఉంది.

విచారణ జరుగుతోంది : ఆర్డీవో

ఈవిషయమై ఆర్డీవో బాలకృష్ణను వివరణ కోరగా, నిధుల దుర్వినియోగం విషయమై ఉన్నతాధికారుల ఆదేశం మేరకు విచారణ జరుగుతోందన్నారు.

దాతల నుంచి వసూలుపై విమర్శలు

నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడల నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతలు నందిగామ ఎంపీడీవో అప్పగించారు. క్రీడాకారులు, క్రీడలు నిర్వహించేందుకు వచ్చిన వ్యాయామోపాధ్యాల ఒత్తిడితో అప్పటి నందిగామ ఎంపీడీవో దాతల సహకారం తీసుకొని వారికి భోజనం ఇతర ఏర్పాట్లు చేశారు.

క్రీడలకు సరిపడా నిధులు ఇవ్వకపోవడం వల్ల ఎంపీడీవోలు దాతల పంచన చేరాల్సి వచ్చిం ది. దీనిపై పెద్దయెత్తున విమర్శలు వెల్లువెత్తడంతో దిగి వచ్చిన ప్రభుత్వం క్రీడలు పూర్తయిన నెల రోజుల తరువాత నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో ఖాతాకు ఒక్కొక్క క్రీడాకారుడికి ఖర్చుల నిమిత్తం రూ.250 చొప్పున జమ చేసింది. మొత్తం 500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్ధారించి రూ.1.29 లక్షలను జమ చేసింది. ఈ నిధులను ఫిబ్రవరి మా సంలో విడుదల చేసింది. అప్పటికే ఎన్నికల బదిలీలో భాగంగా క్రీడలు నిర్వహించిన ఎంపీడీవో జనవరి నెలాఖరున బదిలీపై వెళ్లారు. ఆయన బదిలీ అయిన కొద్ది రోజులకు ఎంపీడీవో ఖాతాకు జమ అయిన ఆడుదాం ఆంధ్ర నిధులు మొత్తం మాయమయ్యాయి. ఆ నిధులను ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది డ్రా చేసుకొని వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి.



చిన్ని గణేష్‌ను చేతులపై తీసుకెళ్తున్న స్నేహితులు



మృతి చెందిన చిన్ని గణేష్, పక్కన ఫైల్ ఫొటో

మృత్యువు వ్యాన్ రూపంలో..
యువకుడి మృతి

● పత్తాలేని 108 అంబులెన్స్
● రక్షించేందుకు స్నేహితుల ఆరాటం

గన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీ తిరుపతమ్మ సంబరం చూసేందుకు వచ్చిన సావరగూడెం యువకుడు వ్యాన్ ఢీకొని మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఇద్దరు యువకులతో కలిసి సావరగూడెం గ్రామానికి చెందిన చిన్ని గణేష్ (22) గన్నవరంలో లక్ష్మీ తిరుపతమ్మ సంబరం చూసేందుకు వచ్చాడు. కోటయ్య స్వామి ఆలయం దగ్గర మరో స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై కూర్చుని చిన్ని గణేష్ మా ట్లాడుతుండగా ట్రావెల్ బస్సు వ్యాన్‌ని ఢీకొట్టింది. వ్యాన్ వచ్చి గణేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో గణేష్ కుడి చెయ్యి ను జ్జునుజ్జు అయ్యింది. అతని స్నేహితులు 108కు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో చేతుల మీదే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం చిన అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే చిన్ని గణేష్ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

60 మంది పిల్లలకు కేన్సర్ నిరోధక వ్యాక్సిన్

● మహేష్‌బాబు ఫౌండేషన్ సహకారంతో బుర్రిపాలెంలో వైద్యశిబిరం



గుండె ఆపరేషన్ చేయించుకున్న పిల్లలతో ఆంధ్రా ఆసుపత్రి వైద్యులు

విజయవాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో బుర్రిపాలెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి 60 మంది పిల్లలకు కేన్సర్ నిరోధక హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వాక్సిన్ (సర్వైకల్ కేన్సర్ రాకుండా) రెండో డోసు వేసినట్టు ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.వి.రావు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ ఆసుపత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నటుడు మహేష్‌బాబు కుమార్తె సితార పుట్టినరోజు సందర్భంగా మహేష్‌బాబు దత్తత బుర్రిపాలెంలో శనివారం ఆంధ్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించామన్నారు. సీజనల్ వ్యాధులు వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్ గురించి అవగాహన కల్పించామన్నారు. బుర్రిపాలెంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ పాఠశాల నుంచి వచ్చిన 148 మంది పిల్లలకు వైద్యపరీక్షలు జరిపి మందులు అందజే శామన్నారు. ఇప్పటి వరకు బుర్రిపాలెంలో 44 వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 35 గుండె వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. యూకేకు చెందిన హీలింగ్ లిటిల్‌హార్ట్ చారిటీ కూడా ఆంధ్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించిందన్నారు. 2015 నుంచి ఆంధ్రా ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన సర్జరీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఒక్కొక్క శిబిరంలో 25 నుంచి 30 ఆపరేషన్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సయోద్ ముదసిర్, డాక్టర్ భూగణేష్, మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా గుండె సర్జరీలు చేయించుకున్న చిన్నారులు తల్లులతో కలిసి పాల్గొన్నారు.

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలుతో

ప్రతిపక్షాల్లో వణుకు : మంత్రి సుభాష్



అన్నదాత సుఖీభవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

కంకిపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను విజయవంతంగా అమలు చేయడంతో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైందని కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి శుభాష్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం కంకిపాడులో ఆయన ప్రారంభించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ. 3174 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం, సబ్సిడీపై ఎరువులు, డ్రోన్‌లు, విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూడలేని ప్రతిపక్ష పార్టీ ప్రజలను తప్పు దోవ పట్టిస్తోందని విమర్శించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, ఆర్డీవో హేలా షారోన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, డీఆర్సీ పీడీ జ్యోతి రమణి, శాస్త్రవేత్త సుధారాణి, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, కంకిపాడు ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ ఎం.కల్యాణి, తహసీల్దార్ భావన్నారాయణ, ఎంపీడీవో అనూష్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు హరికృష్ణ, కోయా ఆనంద్, జనసేన నాయకులు పులి శ్రీనివాసరావు, తాతపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు టెక్ బందోబస్తు

(5వ పేజీ తరువాయి)

ప్రదేశాలకు వెళ్లిపోవచ్చు. వారు అక్కడకు చేరుకోగానే ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే హాజరు నమోదవుతుంది. ఇప్పటికే ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. సాంకేతికంగా ఉన్న తప్పొప్పులు సరి చేసే పనులు కమిషనరేట్‌లో జరుగుతున్నాయి. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో మొత్తం 3,635 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఈ వివరాలన్నీ ఈ డిప్లాయ్‌మెంట్ యాప్‌లోకి అప్‌లోడ్ చేస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు

సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ రెండు వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. ఈ శరన్నవరాత్రుల్లో రెండు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నారు. ప్రతి ఏడాది మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఒక కమాం డ్ కంట్రోల్ సెంటర్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తారు. ఇక్కడి నుంచి జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తారు. ఇక్కడే కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ మాదిరిగా కాకుండా భారీస్థాయిలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. పోలీసు శాఖ పరంగా ఏర్పాటు చేసే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మోడల్ గెస్ట్‌హౌస్ పైభాగంలో గానీ, వెనుక వైపున ఘాట్‌కు గెస్ట్‌హౌస్‌కు మధ్య ఉన్న ఖాళీ స్థలంలో ఈ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నారు. సుమారుగా 40 ఎల్ఈడీ టీవీలతో వీడియో వాల్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ఇది కాకుండా దుర్గగుడి అధికారులు ప్రత్యేకంగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మహామండపంలోని నాలుగో అంతస్తులో దీన్ని ఏర్పాటు చేయడానికి సమాలోచనలు చేస్తున్నారు. దుర్గగుడికి ప్రత్యేకంగా సుమారుగా 250 సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటికి సంబంధించి మహామండపంలో చిన్న కమాం డ్ కంట్రోల్ సెంటర్ మాత్రమే ఉంది. ఇది కాకుండా శాశ్వతంగా ఉండేలా నాలుగో అంతస్తులో 40-50 ఎల్ఈడీ టీవీలతో వీడియోవాల్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

మూల నక్షత్రం నుంచే..

శరన్నవరాత్రుల్లో మొదటి మూడు రోజులు భక్తుల రద్దీ సాధారణంగా ఉంటుంది. మూల నక్షత్రం రోజు నుంచి భక్తుల రద్దీ తీవ్రంగా ఉంటుంది. మూల నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో సుమారుగా లక్ష మంది వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. వారిని నియంత్రించడానికి హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తారు. ఈసారి మూల నక్షత్రం ముందు రోజు నుంచి డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయబోతున్నారు. హోల్డింగ్ పాయింట్లతో పాటు బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ వద్ద డ్రోన్లను గాలిలో ఎగరవేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను దసరా వరకు కొనసాగిస్తారు. గడచిన ఏడాది ఉత్సవాల్లో మూల నక్షత్రం రోజు కంటే దసరా రోజున భక్తులు అత్యధికంగా వచ్చారు. ఈ పరిస్థితి అధికారుల్లో టెన్షన్ పుట్టించింది. అప్పటికప్పుడు డ్రోన్లను ఎగరవేసి ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా అదనపు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా మూల నక్షత్రం రోజు నుంచి గగన నిఘాను కొనసాగించాలని నిర్ణయించారు. దీనితోపాటు హోల్డింగ్ పాయింట్ల వద్ద ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయబోతున్నారు.

జగ్గయ్యపేటలో చైన్ స్నాచింగ్

● నందిగామలో చోరీ చేసిన వారేనని అనుమానం

జగ్గయ్యపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డులో శుక్రవారం పెట్రోల్ బంకు సమీపంలో మోపెడ్‌పై వస్తున్న భార్యాభర్తలపై వెనుక నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన అగంతకులు దాడి చేసి మహిళ మెడలో గొలుసు లాక్కొని పరారయ్యారు. సీతారామపురానికి చెందిన గింజుపల్లి అరుణ, పూర్ణ చంద్రరావు దంపతులు ఇంటికి టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా వెనుక నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన వ్యక్తులు మోపెడ్‌కు టైర్లలో గాలి తగ్గిందంటూ అరుణ మెడలో నాంతాడు తెంపుకుని పరారయ్యారు. అగంతకులు నందిగామ ప్రాంతంలో ఇద్దరు మహిళల మెడలో చైన్‌లు తెంచుకుని పరారైన వ్యక్తులుగా అనుమానిస్తున్నారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా అనుమానితుల చిత్రాలను గుర్తించారు. ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని తగ్గించటానికి పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలకు పొడిగించిన రైళ్లు వారానికి ఒకసారి నడుస్తాయని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం - తిరుపతి (08547) ఈనెల 6 నుంచి సెప్టెంబరు 24 వరకు బుధవారాలలో, తిరుపతి - విశాఖపట్నం (08548) ఈనెల 7 నుంచి సెప్టెంబరు 25 వరకు గురువారాలలో, విశాఖపట్నం - చర్లపల్లి (08579) ఈనెల 8 నుంచి సెప్టెంబరు 26 వరకు శుక్రవారాలలో, చర్లపల్లి - విశాఖపట్నం (08580) ఈనెల 9 నుంచి సెప్టెంబరు 27 వరకు శనివారాలలో నడుస్తాయని తెలిపారు. సంత్రాగచి - యశ్వంత్‌పూర్ (02863) ఈనెల 7 నుంచి 28వ తేదీ వరకు గురువారాలలో, యశ్వంత్‌పూర్ - సంత్రాగచి (02864) ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు శనివారాలలో, షోలాపూర్ - ఎల్‌టిటి ముంబై (01435) ఈ నెల 5 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు మంగళవారాలలో, ఎల్‌టిటి ముంబై - షోలాపూర్ (01436) ఈనెల 6 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు బుధవారాలలో, ఎస్ఎంవీటీ బెంగళూరు - బీదర్ (06519) ఈనెల 14 గురువారం, బీదర్ - ఎస్ఎంవీటి బెంగళూరు (06520) ఈనెల 15వ తేదీ శుక్రవారాలలో నడుస్తాయని శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ 4 కిలోమీటర్ల విస్తరణకు ఓకే

(5వ పేజీ తరువాయి)

గడ్కరీ బయటకు వస్తుండగా, కేశినేని చిన్ని ఆయన్ను కలవగా, హైదరాబాద్-విజయవాడ ఆరు వరసల మార్గాన్ని అదనంగా నాలుగు కిలోమీటర్లు పొడిగించటానికి ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ఎంపీ చిన్ని కోరిన విధంగా గొల్లపూడి నుంచి పున్నమి ఘాట్ వరకు ఎన్‌హెచ్-65 ఆరు వరసలుగా విస్తరించనున్నారు.

ఎన్‌హెచ్-30పై ఆర్‌వోబీ పనులకు శంకుస్థాపన

విజయవాడ-ఛత్తీస్‌ఘడ్ హైవే ఎన్‌హెచ్-30పై ఇబ్రహీంపట్నం నుంచి చంద్రగూడెం వరకు రెండులేన్ల ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శనివారం శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో జరిగిన శంకుస్థాపనల కార్యక్రమంలోనే దీనిని కూడా పూర్తిచేశారు. ఈ పనులను రూ.36 కోట్లతో చేపట్టనున్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను ఈ ఆర్‌వోబీ అరికట్టనుంది.

ఎంపీ బాలశౌరి పీఏ మోసంపై బాధితుల ధర్నా

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని అందరినీ నమ్మించాడు. ఎంపీ సిఫార్సు చేసినా.. అధికారులకు కొంతనగదు ఇవ్వాల్సి ఉంటుందని, ఖర్చులు కొంతమేర ఉంటాయని చెప్పాడు. మచిలీపట్నం మెడికల్ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, ల్యాబ్ అసిస్టెంట్ తదితర పోస్టులు, విద్యుత్ సబ్ స్టేషన్‌ల్లో ఎలక్ట్రీషియన్ పోస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వివిధ రకాల ఉద్యో గ నియామకాల కోసం నోటిఫికేషన్‌లు జారీ అయ్యాయని, వీటిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. తనకు తెలిసిన వారి ద్వారా తెర వెనుక బేరాలు కుదుర్చుకున్నాడు. ఒక్కొక్క ఉద్యోగానికి రూ.1.50 లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేశాడు. నగదు ఇచ్చే విషయంలో మధ్యవర్తుల వద్దకు వెళ్లవద్దని, నేరుగా తన బ్యాం కు ఖాతాకు, లేదా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదు జమచేయాలని కోరాడు. గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నగదు వసూలు చేశాడని బాధితులు చెబుతున్నారు.

ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని, అల్లరి చేయవద్దని, ఉద్యోగాలు ఇప్పించకపోయినా, మీ నగదు మీకు ఇప్పిస్తామని ఎంపీ కార్యాలయంలో పనిచేసే గరికపాటి శివ తమకు హామీ ఇచ్చినట్లు బాధితు లు తెలిపారు. శనివారం మచిలీపట్నంలోని ఎంపీ కార్యాలయానికి రావాలని చెప్పడంతో తామం తా వచ్చామని, ఇక్కడ తమకు సమాధానం చెప్పేందుకు ఎవ్వరూ అందుబాటులో లేరని బాధితులు తెలిపారు. ఎంపీ పీఏ శివకు ఫోన్ చేస్తే మిమ్మల్ని మోసం చేసిన గోపాల్ సింగ్ పోలీసుల అదుపులో ఉన్నాడని, మీరు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో బాధితులు ఎంపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

గోపాల్‌సింగ్‌పై కేసునమోదు

ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన ఘటనలో ఎంపీ పీఏగా చెబుతున్న గోపాల్‌సింగ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు చిలకలపూడి పోలీస్‌స్టేషన్ సీఐ అబ్దుల్‌నబీ తెలిపారు. గరికపాటి సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతుందని సీఐ తెలిపారు.

పోలీసుల రాకతో ఆందోళన విరమణ

ఎంపీ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేస్తున్నారనే సమాచారంతో ఆర్‌పేట సీఐ ఏసుబాబు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చారు. గోపాల్ సింగ్ మిమ్మల్ని మోసం చేసిన ఘటనపై ఇప్పటికే విచారణ చేస్తున్నామని, మీరు కూడా ఫిర్యాదు చేస్తే కేసు మరింతగా బలపడుతుందని, ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించారు. అయితే బాధితులు మాకు ఉద్యోగాలు వద్దని, తాము ఇచ్చిన నగదును తిరిగి ఇచ్చేవరకు ఆందోళనలు చేస్తూనే ఉంటామని చెప్పారు. ఈ విషయంపై అవనిగడ్డ ఎమ్మెల్యే వద్దకు, జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లి అక్కడే తేల్చుకుంటామని బాధితులు అన్నారు. ఎంపీ బాలశౌరి అంటే మాకు పూర్తి నమ్మకమని, ఆయన దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతామని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



పారిశుధ్య సిబ్బందికి రైన్‌కోట్లు పంపిణీ

కంకిపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య సిబ్బందికి అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉందని సర్పంచ్ పి. ఇందిర అన్నారు. ఈడుపుగల్లు పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అవసరమైన రైన్‌కోట్లను శనివారం ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్ కుమార్, ఉపసర్పంచ్ కిలారు శ్రీను, వార్డు సభ్యులు షకార్, అనుమోలు రామకృష్ణ, టీడీపీ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.



రైన్‌కోట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఇందిర

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
● నున్నలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ప్రారంభం



రైతులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయ వాడ రూరల్ మండలం నున్నలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రైతులకు పథకం ద్వారా పెట్టుబడి సహాయం కింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 48.86 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మూడు విడతల్లో ప్రతి రైతుకు రూ. 20 వేలు పెట్టుబడి సహాయం అందించనున్నట్లు వివరించారు. సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్క టిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని అందులో భాగంగా ఈ నెల రెండవ వారంలో స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు వెంకటే శ్వర్లు, రఘురామ్, టీడీపీ నేతలు గొడ్డళ్ల చిన్నరామా రావు, కలకోటి శ్రీనివాసరెడ్డి, మాదు శివరామ్‌ప్రసాద్, సర్పంచ్ కాటూరి సరళ తదితరులు పాల్గొన్నారు.

9,058 మంది అర్హులు ..

హనుమాన్‌జంక్షన్ : రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ పథకానికి మండలంలో 9,058 మంది రైతులు అర్హులుగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి రంగనాథబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులందరికి భరోసా సొమ్ము వారి వారి ఖాతాల్లో పీఎం కిసాన్ సొమ్ముతో పాటు జమ అవుతుందని సాంకేతిక కారణాలతో ఎవరికైనా జమ కానిపక్షంలో రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు.

అన్నదాతలకు అండగా..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సీజన్ మొదలయ్యే సమయానికి అన్న దాతకు అండగా నిలబడేలా పెట్టుబడి సాయం అందిస్తున్న సుఖీభవ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏవో రంగనాథ్‌బాబు సూచించారు. కానుమోలు పీఏసీఎస్ ఆవరణలో టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించడాన్ని రైతులు, నాయకులతో కలిసి లైవ్‌లో తిలకించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ దన్నే దుర్గారావు, మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు, టీడీపీ అధ్యక్షుడు దన్నే మల్లికార్జునరావు, పీఏసీఎస్ సిబ్బంది నాగభూషణం, వీఏఏ విక్రమ్, రైతులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలోని 5952మంది రైతులకు రూ.2.98కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 4703మంది రైతులకు రూ.0.94కోట్లు వెరశి మొత్తం 3.92కోట్ల నిధులు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విడుదల చేసినట్లు ఏవో గద్దె రమేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయం కింద తొలివిడతగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే రూ.2వేలు, రూ.5వేలు కలిపి మొత్తం రూ.7వేలు చొప్పున రైతు ఖాతాలో నేరుగా జమచేయడం జరిగిందని పేర్కొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మల్లికార్జుననాయక్

గురుకుల పాఠశాల పరిశీలన

ఉయ్యూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని తరగతుల విద్యార్థులతో ముచ్చటించి మధ్యాహ్న భోజనం చేశారు.



సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనమలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వివిధ అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు రెండున్నర లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యార్లగడ్డ సుచిత్ర, దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చెల్లెలుపై అన్న దాడి- కేసు నమోదు

పెనమలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కానూరుకు చెందిన ఒక వివాహితపై తన అన్న దాడి చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కానూరుకు చెందిన అసిలేటి జయప్రద పనిమనిసిగా జీవనం సాగిస్తుంది. ఆమె గత నెల 29న ఇంట్లో ఉన్నప్పుడు ఆమె అన్న లంకపల్లి శామ్యూల్ దుర్భాషలాడి ప్లాస్టిక్ స్టూల్, స్టీల్ ప్లేట్‌లతో దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో కంటి వైద్యశిబిరం నేడు

పెనమలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బోడె ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు, ఫినిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర ఫౌండేషన్ సౌజన్యంతో నేడు కానూరులో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు యువనేత బోడె వెంకట్రామ్ తెలిపారు. కానూరు తులసీనగర్‌రోడ్డు1 వరలక్ష్మీపురం కమిటీ హాల్‌లో ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే వైద్యశిబిరానికి స్థానికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఉచిత వైద్యశిబిరానికి హాజరయ్యే వ్యక్తులు తమ వెంట ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డుల జిరాక్స్‌లను తెచ్చుకోవాలని కోరారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రియాజ్ బాషా

ఉయ్యూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని న్యాయశాస్త్ర ప్రొఫెసర్, మానవత స్వచ్ఛద సంస్థ డైరెక్టర్ రియాజ్ బాషా అన్నారు. ఏజీ అండ్ ఎస్ జీ ఎస్ కళాశాల సర్ణోత్సవం పురస్కరించుకుని కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరియర్ పై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాగకుమార్, ప్రిన్సి పాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనా రాయణ, అనిల్‌కుమార్, గిరి ప్రసాద్, కిషోర్ పాల్గొని పలు సూచనలు చేశారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జీఎన్ రావు

వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రం ప్రారంభం

పెనమలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆవరణలో శనివారం కే సూర్యనారాయణమ్మ డాక్టర్ కేవీ ప్రసాద్ పేరిట వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి కాసరనేని దమయంతి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎన్ రావు, వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రం నెట్‌వర్క్ ఇన్‌చార్జి డాక్టర్ అవినాష్ పతంగే తదితరులు హాజరయ్యారు. క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసువా కపూర్ మాట్లాడుతూ, ఈ కేంద్రాన్ని విశాఖపట్నంలోని సంధ్యా మెరైన్స్ సామాజిక సేవా బాధ్యత ప్రేరణగా అందిస్తున్న మద్దతుతో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి దాతల కుటుంబం సంధ్యా మెరైన్స్ లిమిటెడ్ యజమాని కొండ్రగుంట ఆనంద్‌కుమార్, డాక్టర్ కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదం- ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఉయ్యూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు పట్టణ నడిబొడ్డున స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట ఒకరిపై ఒకరు దాడులకు దారితీసింది. గౌడరామాలయం సమీపాన పాత షాదీఖానా రోడ్డులో వివాదాస్పద ఖరీదైన స్థలంలో శుక్రవారం రాత్రి ఓవర్గం షెడ్డు వేసేందుకు పూనుకోగా మరొక వర్గం అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఘర్షణ ఏర్పడి తోపులాటలో ఉద్రిక్తత చోటుచేసుకోగా పోలీసులు వచ్చి సద్దుమణిగేలా చేశారు.

విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులే కీలకం



మాట్లాడుతున్న పుణ్యచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్

గన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని సీనియర్ రొటేరియన్, పుణ్యచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ అన్నారు. స్థానిక బాలికల జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతిలో ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధించిన ఉపాధ్యాయులను పుణ్యచారిటీస్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా విజయభూషణ్‌కుమార్ మాట్లాడుతూ, పుణ్యచారిటీస్ సేవా కార్యక్రమా ల్లో భాగంగా పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తామని తెలిపారు. రొటేరియన్ గన్నె వెంకట్రావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబరిచి రోటరీ రోలింగ్ షీల్డ్ అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. నర్రా సీతారా మారావు, రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్ష కార్యదర్శులు జీవి రవిబాబు, కె.నాగరాజు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలే మార్గం



మాట్లాడుతున్న రమాదేవి

గన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటిత పోరాటాలే మార్గమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్. రమాదేవి అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గన్నవరం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గన్నవరం ప్రాజెక్ట్ కమిటీ మహాసభ జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్లం వెంకటేశ్వరరావు, రమా, తాతబ్బాయి, కడవకొల్లు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు : స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల పథకాన్ని, ట్రూ అప్ చార్జీలను తక్షణం రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వి. శివశంకర్, ఈ. కోటేశ్వరరావు, వై. బుల్లియ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య సేవలు ఆదర్శనీయం



పింగళి చిత్రపటం వద్ద పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత నాయకులు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జెండా రూపొందించిన పింగళి వెంకయ్య తెలుగు జాతికి గర్వకారణమని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల పాలిటెక్నిక్ కాలేజీలో అగ్రికల్చర్ డిప్లోమా చదువుతున్న జంక్షన్‌కు చెందిన విద్యార్థిని బొంకూరి హంసికకు మానవత నిర్వాహకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, జంక్షన్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు బానాల నరసింహారావు, పాబోలు గణేష్‌బాబు, సభ్యులు కొట్నేని రామచంద్రరావు, జేవీవీ సత్యనారాయణ, గంటా సత్యనారాయణ పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం భారత జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో పింగళి వెంకయ్య విశిష్టతను కరస్పాండెంట్ షేక్ ఇమాం వివరించారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా పాల్గొన్నారు. స్థానిక స్రవంతి హైస్కూల్‌లో 8, 9, 10 విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా జిల్లా మాజీ సైన్స్ కో-ఆర్డినేటర్ మాణిక్యాలరావు వ్యవహరించగా కొమ్మినేని రామకృష్ణ పాల్గొన్నారు.

కానూరు : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం కానూరులోని అశోక్ జిమ్‌లో మాతృ హృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధులు పింగళి చిత్రపటానికి గన్నవరం ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అశోక్ జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్, నాగేశ్వరరావు, రఘురామ్, శారద తదితరులు పాల్గొని పింగళికి నివాళులర్పించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



యనమలకుదురులో తల్లిపాల వారోత్సవాలు

పెనమలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు ఐసీడీఎస్ పరిధిలోని యనమలకుదురు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం కళ్యాణి అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డకు అమృతతుల్యమని, ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలోఅంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, లక్ష్మి, ఎండీ హలీమాబీ, విజయలక్ష్మి, కే పూర్ణసంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు** : తల్లిముర్రుపాలు బిడ్డకు రోగనిరోధక శకినిఇస్తుందని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తప్పక తాగించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ వెంకటరాఘవమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం నాగన్నగూడెంలో తల్లులు, గర్భవతులతో సమావేశం నిర్వహించి బిడ్డకు తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. అంగ్వాడీ కార్యకర్తలు పార్వతి, రమాదేవి, ఉషారాణి, నాగసులోచన పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ముర్రుపాలు బిడ్డకు సహజ టీకా లాంటివని, వ్యాధినిరోధకశక్తిని పెంచే సంజీవిని లాంటి తల్లిపాలను బిడ్డ పుట్టిన గంటలోపు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి సూచించారు. అంపాపురం, ఎ.సీతారాంపురం గ్రామాల్లో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, చిన్నారుల తల్లులు తీసుకోవాలసిన పోషకాహారాలను సోదాహరణంగా చూపుతూ వివరించారు. తల్లులు తాజా ఆకుకూరలు, గుడ్లు లాంటి బలవర్ధకమైన ఆహారం తీసుకో వడం వల్ల బిడ్డకు తల్లిపాల ద్వారా విటమిన్లు అందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు గర్భిణులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో..

ఉంగుటూరు : తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరమని, పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి. ఎల్.దుర్గాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పెదఅవుటపల్లి, తేలప్రోలు, ఉంగుటూరు, మానికొండ సెక్టార్ల పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆరోగ్యసిబ్బంది, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు తలశిల కృష్ణమూర్తి గారి కుమారుడు తలశిల వెంకట సుబ్రహ్మణ్యం గారి సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈదిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని యార్మారెడ్డి సీతారెడ్డి గారు ది.04.10.2024న శ్రీ నున్న సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 9317/2024రుగా రిజిస్టర్డు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా క్రయము పొంది తదాది వారు సదరాస్తిని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలుపుచున్నారు. యిట్టి స్థితిలో ఈదిగువ షెడ్యూలు ఆస్తిని యార్మారెడ్డి సీతారెడ్డి గారు అమ్మచూపగా, నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని క్రయము చేయదలచి క్రయము ఖరారు చేసుకొని ఉన్నారు. కావున ఎవరికైనను ఈ దిగువ షెడ్యూలు ఆస్తి పై గాని, ఎవరికైనను ఏవిధమైన హక్కులుగాని, చెల్లదగు క్లయిములు గాని, మరి ఏవిధమైన అభ్యంతరములు గాని, ఉన్న యెడల, వారు ఈ ప్రకటన తేది లగాయతు 07 రోజుల వ్యవధి లోపుగా మాకు అందేలాగా తగు సాక్ష్యాధార పత్రముల కాపీలతో లిఖితపూర్వకముగా రిజిస్టరు పోస్టులో తిరుగు చీటితో సహా యీ దిగువ చిరునామాకు తెలియజేయవలసినది. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములుగాని, క్లయములు గానీ, రాని యెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా ఎంచి, నా క్లయింటు షెడ్యూలు ఆస్తిని క్రయము పొంది వారి పేర రిజిస్టర్డు క్రయదస్తావేజు పొంద గలరనియు, ఆ దర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయములుగానీ, నా క్లయింటును గానీ, షెడ్యూలు ఆస్తిని గానీ, చట్టపరంగా బైండు చేయజాలవనియు, నా క్లయింటు పొందు క్రయమును భంగము చేయజాలవనియు, ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు: యన్.టి.ఆర్.జిల్లా, శ్రీ నున్న సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, నున్న గ్రామ ఆర్.యస్.నెం.789-2రు సబ్ డివిజన్ దాఖలా ఆర్.యస్. నెం.789-2బి రు దాఖలా చ.గ 967.0లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు: **తూర్పు** : అ.33.0లు వెడల్పు గల రోడ్డు అ.56.0లు **దక్షిణం** :బొంతు సాంబిరెడ్డి గారి ఆస్తి అ.155.5లు **పడమర** : వుయ్యూరు కోటిరెడ్డి గారి ఆస్తి అ.56.0లు **ఉత్తరం** : యార్మారెడ్డి శివారెడ్డి గారి ఆస్తి అ.155.5లు.

ఆర్.కృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.30-22-69, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002. ఫోన్ నెం: 9885942416.



వేడుకలు చేసుకుంటున్న ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు

ఎన్టీటీపీఎస్ 3వ యూనిట్ 200 రోజుల వేడుకలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో 3వ యూనిట్ నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేసి 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ద్వితీయ దశ జనరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గోగినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేట్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చీఫ్ ఇంజనీరు శివ రామాంజనేయులు ఉద్యోగులకు, కార్మికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్, సురేష్‌బాబు, వెంకయ్య, గుప్తా, వెంకటేశ్వరరావు, గణపతి, నారాయణ, కొత్తపల్లి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సంగమం వద్ద యువకుడు గల్లంతు



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద ఈత కొడుతూ వరద ఉధృతికి పశ్చిమ ఇబ్రహీంపట్నంకు చెందిన కలకంటి నవీన్ (19) గల్లంతయ్యాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న యువకుడు శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సంగమం వద్ద ఈత కొడుతూ గల్లంతయ్యాడు. యువకుడి కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ గాలింపు చర్యలు చేపట్టింది.

మూడు రోజులపాటు రెండు రైల్వే గేట్లు మూసివేత

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి, రాయనపాడు రైల్వే గేట్లను మరమ్మతుల నిమిత్తం ఈనెల 4 నుంచి 6 వరకు మూడు రోజుల పాటు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసి వేస్తున్నట్టు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశ్రామికరంగానికి ప్రభుత్వం చేయూత

- కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం

పెనుగంచిప్రోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఎంతో చేయూతనిస్తుందని కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం పేర్కొన్నారు. మండలంలోని కొణకంచి క్రాస్‌రోడ్డు సమీపంలో నెలకొన్న పారామౌంట్ ఇండస్ట్రీని రఘురాం శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారామౌంట్‌లో ఇటీవల చోటుచేసుకున్న దురదృష్ట సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. పారామౌంట్ అధినేత వెనిగళ్ల సురేష్ కుమార్ అందిస్తున్న సేవలను రఘురాం కొనియాడారు. వేరే ప్రాంతంలో ఉన్న వెనిగళ్ల సురేష్ కుమార్, నెట్టెంతో ఫోన్లో మాట్లాడి ప్రభుత్వం తమకు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. జగ్గయ్యపేట ఏఎంసీ మాజీ చైర్మన్ గింజుపల్లి రమేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ లేదని కారు యజమానికి చలానా రద్దు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

విజయవాడ లీగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'పోలీసుల తకరారు' శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి ట్రాఫిక్ పోలీసుల నుంచి స్పందన వచ్చింది. వెంటనే కారు యజమాని టీ రాజేష్ హెల్మెట్ లేకుండా ప్రయాణించారంటూ విధించిన ట్రాఫిక్ చలానును శనివారం పోలీసులు రద్దు చేసి బైక్ యజమానికి ఆ చలానాను బదలాయించారు. ఈ మేరకు కారు యజమాని రాజేష్‌కు పోలీసుల నుంచి మెసేజ్ వచ్చింది.



వర్క్‌షాప్‌నకు హాజరైన వైద్యులు

నాగార్జున ఆసుపత్రిలో ఈయూఎస్ వర్క్‌షాప్

కానూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగార్జున ఆసుపత్రిలో ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్) వర్క్‌షాప్ శనివారం విజయవంతంగా జరిగింది. ఈ వర్క్‌షాప్‌నకు ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి 8 మంది వైద్యులు పాల్గొని ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్‌కు సంబంధించి ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగార్జున ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ధనిష్ట బత్తుల మాట్లాడుతూ 32 ఏళ్లగా స్థానిక ప్రజలు నాణ్యతతో కూడిన ఆరోగ్య సేవలందిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రికి ఎండోస్కోపీ విభాగానికి సీఏహెచ్‌వో (కన్సార్టియం ఆఫ్ అక్రిడేటెడ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్) నుంచి ఎండోసేఫ్ సర్టిఫికెట్ లభించిందన్నారు. రాష్ట్రంలో ఈ గుర్తింపు పొందిన ఏకైక ఆసుపత్రి నాగార్జున ఆసుపత్రి కావడం విశేషమన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు కోర్సు డైరెక్టర్‌గా డాక్టర్ కే జగన్మోహన్‌రావు, ఫ్యాకల్టీ నిపుణుడిగా డాక్టర్ చలపతిరావు వ్యవహరించారు.

15 వరకు హర్ ఘర్ తిరంగా

కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆగస్టు 2 నుంచి 15 వరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'హర్ ఘర్ తిరంగా క్యాంపైన్-2025' జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన సంక్షేమ శాఖ జిల్లా నోడల్ అధికారి యూ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాల నిర్వహించటమే దీని ముఖ్యోద్దేశ్యమన్నారు. తిరంగా ర్యాలీలు, దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక ప్రదర్శనలు, స్వాతంత్ర్య సమరం నాటి సంఘటనలను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్ల ఏర్పాటు, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయుట వంటివి నిర్వహించాలన్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, స్థానిక సంస్థలు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొనటంతోపాటు జాతీయ జెండా వద్ద దిగిన సెల్ఫీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ అధికారులు/స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించబడిన రోజువారీ విశేషాలను మెయిల్ ఐడీ apculturecommission@gmail.comనకు పంపాలన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు స్పందన



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టార్ కళాశాలలో ప్రారంభించిన 2రోజుల చెస్ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 226 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను స్టార్ కళాశాల అధినేత పీ శ్రీరామ్ ప్రారంభించారు. రాష్ట్ర చెస్ చాంపియన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎంఎన్ ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఫౌండర్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ పర్యవేక్షించారు. వివిధ జిల్లాల నుంచి గెలుపొందిన క్రీడాకారులతో పాటు ఓపెన్ కాంపిటేషన్‌లో క్రీడాకారులు పాల్గొన్నారు. 140 మంది బాలురు, 86 మంది బాలికలు పాల్గొన్నారు. ఆదివారం ఫైనల్స్ నిర్వహించనున్నారు. బహుమతి ప్రదానోత్సవానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొననున్నారు. అయ్యప్పస్వామి, ఆదిత్య పర్యవేక్షించారు.



ట్రాఫిక్ జామ్

నగరంలోని పలుచోట్ల రాత్రి సమయంలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. వన్‌టౌన్‌లోని దుర్గగుడి సమీపంలో, అలాగే ప్రకాశం బ్యారేజీపై ట్రాఫిక్ చట్రంలో ఇరుక్కున్న వాహనదారులు గంటల కొద్దీ వాహనాలు కదలకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు పలువురు వీఐపీలు అటువైపుగా వెళుతుండటంతో పోలీసులు వీఐపీ వాహనాలకు దారిచ్చేందుకు ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ నిలిపేశారు. దీంతో ముందుకు గానీ, వెనక్కి గానీ వెళ్లే అవకాశం లేక వాహనదారులు అక్కడే నిలిచిపోయారు.



ఒంటరైనా.. ఓటమైనా..!



- స్నేహితులు తోడుంటే ఏ సముద్రమైనా దాటేయొచ్చు
- స్నేహంతోనే షేరింగ్.. కేరింగ్..!
- బంధుత్వానికి చెప్పలేనివీ పంచుకునేది స్నేహితులకే
- నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: సంతోషంగా ఉన్నపుడు లేకపోయినా బాధలో వెంట ఉండేవాడే నిజమైన స్నేహితుడు. తన ఓదార్పుతో ఒంటరితనాన్ని ఓటమిని దూరం చేస్తాడు. ఓటమికి కారణాలు వివరిస్తూ గెలవడానికి ధైర్యాన్నిస్తాడు. క్లాస్ రూంలో తెలుసుకోలేని జీవిత పాఠశాలను స్నేహం నేర్పుతుంది. కష్టమైనా.. సుఖమైనా.. ఓటమైనా.. గెలుపైనా.. ఈ సందర్భంలోనూ చేయి వదలని వాడు స్నేహితుడు మాత్రమే. తల్లిదండ్రులకు, తోబుట్టువులకు, చివరకు జీవిత భాగస్వామికి కూడా చెప్పుకోలేని ఎన్నో రహస్యాలను పంచుకునేది స్నేహితుడు మాత్రమే. ప్రతిదీ షేర్ చేసుకుంటూ, కేర్ తీసుకోవడం స్నేహంతోనే సాధ్యం. రోజుకు 2 గంటలు స్నేహితులతో గడిపితే ఎన్నో అనారోగ్య సమస్యలను తరిమి కొట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. దోస్తులే ఆస్తులుగా ఉన్నవారు.. కష్టాలనైనా, కన్నీళ్లనైనా తేలిగ్గా దాటేయగలడు. ఎలా చూసినా ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహం ఉంటుంది. నిజమైన స్నేహం మట్టిలో కలిసిపోయేదాకా నిలిచే ఉంటుంది.

మన బలమెంతో చెప్పేదే స్నేహం

కొన్ని సందర్భాల్లో మనకు తెలియని మనమేంటో



చెప్పేది స్నేహితుడు మాత్రమే. ఈ పని చేయగలనా, లేదా అన్న సందిగ్ధంలో ఉన్నపుడు నువ్వు చేయగలవంటూ ప్రోత్సహించేది స్నేహితుడే. పైగా వెన్నుతట్టి భరోసా ఇచ్చి విజేతగా నిలబెడతాడు. ఏ నిర్ణయం తీసుకోలేని సందర్భాల్లో స్నేహితుడితో కలిపే మాట స్పష్టమైన దారిని చూపిస్తుంది.

నిజమైన గురువు

దైనందిన జీవితంలో ప్రతివ్యక్తి ఎదుగుతున్నప్పుడు మంచి, చెడూ అన్నీ 80 శాతం స్నేహితులను చూసే నేర్చుకుంటాం. ఆటలు, చదువు, ఉద్యోగం, లక్ష్యాలు, షాపింగ్, అభిరుచులు, జీవిత నైపుణ్యాలు.. ఇలా ప్రతిదీ స్నేహితుల నుంచే అలవర్చుకుంటాం మనిషి చెడుదారి పట్టడానికి చెడు స్నేహం ఎలా పని చేస్తుందో, ఎదగడానికి మంచి స్నేహం అలాగే దోహదపడుతుంది. మంచి స్నేహితుడితో సానుకూల జీవితం ఏర్పడుతుంది.

భావోద్వేగాల బంధం



ప్రేమలు, అనుబంధాలు, రహస్యాలు, చేసిన తప్పులు.. ఒప్పులు అన్నీ మిత్రుడితోనే చెప్పుకుంటాం. దీన్ని బట్టి స్నేహితుడుకి మన జీవితంలో ఎంతటి స్థానం ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఆరోగ్యానికి మేలు

స్నేహం మనసుకి, తనువుకి ఆరోగ్యకరమని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. ఒత్తిడి, ఆందోళన, మానసిక ఇబ్బందుల్లో ఉన్నపుడు ఇష్టమైన స్నేహితులు పక్కనుంటే రెట్టింపు వేగంతో కోలుకుంటామని హెల్దీ మూడ్స్ అధ్యాయనంలో తేలింది. ఎక్కువ మంది స్నేహితులున్నవాళ్లకి అనారోగ్య సమస్యలు తక్కువట. కష్టాలు, బాధలు, సుఖాలు, సంతోషాలన్నీ పంచుకున్నపుడు మొదడులో ఆక్సిటోసిన్ స్థాయిలో పెరిగి మనసు తేలిక పడుతుందంటున్నారు. ఇదీ స్నేహంతో వచ్చే ఆరోగ్య సంపద.

పింగళి దేశభక్తి స్ఫూర్తిదాయకం

- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ



పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయపతాక నిర్మాత పింగళి వెంకయ్య అందరికీ స్ఫూర్తిదాయకమని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం పింగళివెంకయ్య, బళ్లారి రాఘవ చిత్రపటాలకు గీతాంజలి శర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీఆర్వో కే చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచేనాని, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, లంకే శేషగిరి, వ్యవసాయ శాఖాధికారి మణికంఠ, బీజేపీ నేతలు దూళిపాల శ్రీరామ చంద్రమూర్తి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ నాడు మహాత్మ గాంధీ పిలుపు మేరకు పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించారన్నారు. కృష్ణవిశ్వవిద్యాలయంలో రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్ ఉష, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎన్ శ్రావణి, ఫిజికల్ డైరెక్టర్ గోపి పాల్గొన్నారు. విద్యార్థులు జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. కాగా, వివిధ కళాశాలల్లో, కార్యాలయాల్లో పింగళి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం : ఎస్పీ

మచిలీపట్నం క్రైమ్: మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఆవరణలలో జరిగిన పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు పాల్గొని పింగళి, బళ్లారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య కృష్ణాజిల్లా వాస్తవ్యులు కావటం గర్వించతగ్గ పరిణామమన్నారు. తెలుగు నాటక రంగ ప్రముఖులు బళ్లారి రాఘవ బహుముఖ ప్రజ్ఞత్వాన్ని ఆయన వివరించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పింగళి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు



కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

జగ్గయ్యపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎస్ఎల్ఎస్ కల్యాణమండపంలో జరిగిన సీపీఐ ప్రతినిధుల సభలో, అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా హామీలు నెరవేర్చటంలో వెనుకబడి పోయిందన్నారు. త్వరలో జరగబోయే సీపీఐ రాష్ట్ర, జాతీయ సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. సీపీఐ నేత బాబూరావు మాట్లాడుతూ జగ్గయ్యపేటను పారిశ్రామిక క్యారిడార్‌గా ప్రకటించే వరకు పోరాడుతామన్నారు. పార్టీ నేతలు అక్కినేని వనజ, సీహెచ్ కోటేశ్వరరావు, తూము కృష్ణయ్య, సీహెచ్ సుబ్బారావు, జీ కోటేశ్వరరావు, పీ దుర్గాభవానీ, పరుచూరి రాజేంద్ర, బుట్టి రాయప్ప, బండి రమేష్, గోవిందరాజులు, బంకా ఝాన్సీ పాల్గొన్నారు.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్

గుణదల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మాసం కావడంతో ఆగస్టులో బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ఆఫర్‌ను ప్రవేశపెట్టినట్టు బీఎస్ఎన్ఎల్ బిజినెస్ యేరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్ శ్రీను తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ఆఫర్ ద్వారా రూపాయితో 30 రోజులపాటు ప్రతి రోజు 2జీబీ డేటా ఉచిత కాల్, ఉచిత సిమ్ పొందే అవకాశం ఉందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆత్మ నిర్మల్ భారత్‌లో భాగంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో 4జీ సేవలను దేశవ్యాప్తంగా ప్రారంభించినట్టు తెలిపారు. 4జీ సేవలను మరింత సరళతరం చేయాలన్న ఆలోచనతో రూపాయికే 30 రోజులపాటు 2జీబీ డేటా అందిస్తూ ఉచిత కాల్, ఉచిత సిమ్ ప్రవేశపెట్టామన్నారు. రిటైలర్స్‌ను సంప్రదించి ఆఫర్‌ను పొందాలన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో కొత్తగా 129 పోలింగ్ కేంద్రాలు: డీఆర్వో

కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా జిల్లాలో కొత్తగా 129 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని, వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో లక్ష్మీ నరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (ఎస్ఐఆర్ 2026) ముందస్తు సన్నాహకంలో భాగంగా నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో జూలై 20న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను అందచేశామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 ఓటర్లకు మించి ఉంటే ఆ పోలింగ్ కేంద్రాన్ని హేతుబద్ధీకరించి కొత్తగా పోలింగ్ కేంద్రంలో విలీనం చేయాలని ఆదేశించారన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 1792 పోలింగ్ కేంద్రాల్లో 295 పోలింగ్ కేంద్రాల్లో 1200 మంది ఓటర్లు మించి ఉన్నారన్నారు. మించి ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రంలో విలీనం చేసి కొత్తగా మరో 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన 129 పోలింగ్ కేంద్రాలతో జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1921 చేరిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 17,07,589 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సగటు ఓటర్లు 889గా నమోదై ఉన్నారని తెలిపారు. జాబితాపై అభ్యంతరాలుటే 4లోగా తమ దృష్టికి తేవాలని, వాటిని పరిశీలించి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఈనెల 5న ప్రచురించడం జరుగుతుందని డీఆర్వో లక్ష్మీ నరసింహం తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు

12లోగా పరిష్కరించాలి

- ఫ్యాప్టో నేతల డిమాండ్

ధర్నాచౌక్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయుల వేతనాలు, బోధనేతర పనులు రద్దు, 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, మధ్యంతర భృతి, పెండింగ్ డీఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పలువురు వక్తలు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఈ నెల 12న రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్యాప్టో రాష్ట్రనేత ఎన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆగస్టు 12న చలో డైరెక్టరేట్‌కు పిలుపునిస్తామని, మరో బీఆర్టీఎస్ ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఫ్యాప్టో ప్రధానకార్యదర్శి ఇంటి రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ధర్నా అనంతరం నేతలు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు పాండురంగ వరప్రసాద్, ఎస్టీయూ రాష్ట్ర నేత కొమ్ము ప్రసాద్, ఫ్యాప్టో కో-చైర్మన్ ఆర్ రాంబాబు నాయక్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ ప్రసంగించారు.



ధర్నా నిర్వహిస్తున్న ఫ్యాప్టో నేతలు



రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు

నిందితులకు కఠిన శిక్షలు విధించడంలో

ప్రాసిక్యూషన్ కీలకపాత్ర పోషించాలి

- డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా

విజయవాడ లీగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో గత జనవరి నుంచి జూన్ వరకూ ఎస్సీ, ఎస్టీ (అణిచివేత అరికట్టే) ప్రత్యేక న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులపై రాష్ట్రస్థాయిలో సమీక్షా సమావేశాన్ని శనివారం విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసికూయషన్స్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కేసులో బాధితుడికి న్యాయం, నిందితుడికి శిక్ష విధించి సమాజానికి హెచ్చరిక ఇవ్వడం ఈ విభాగం ప్రధానమైన బాధ్యతని తెలిపారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్లు వీ రాజేంద్రప్రసాద్, ఎం విజయ, సోషల్ వెల్ఫేర్ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీ దేవి పాల్గొన్నారు.

13న మోదీ, ట్రంప్

దిష్టిబొమ్మలు దహనం చేయండి

- స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంతో వ్యవసాయ రంగానికి తీరని నష్టం: వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మోదీ, ట్రంప్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాలని ఏపీ రైతు సంఘాల సమావేశం రైతులకు పిలుపునిచ్చింది. రాష్ట్ర రైతు సంఘాల నేతల సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ట్రంప్, మోదీ దిష్టి బొమ్మలను దగ్ధం చేయాలన్నారు. స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్రం ప్రమాదమన్నారు. వాణిజ్య ఒప్పందాలు వ్యవసాయం, రైతులకు మేలు జరిగేలా ఉండాలని, వారికి నష్టం కలిగించేలా ఉండకూడదని హితవు పలికారు. రైతు సంఘం సీనియర్ నేత కేశవరావు మాట్లాడుతూ అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. రైతు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిల రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అటవీ జంతువుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని, కార్పొరేట్ సంస్థలకు భూపందేరాలు నిలిపి వేయాలన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను రద్దు చేయాలని ఈ నెల 13న నిరసనలు పెద్దఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15 నుంచి 26 వరకు రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేయాలన్నారు. రైతుసంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ చైర్మన్ ప్రభకర్‌రావు, కిసాన్ సంఘటన్‌నేత మరీదు ప్రసాద్‌బాబు, రైతు కూలీ సంఘం నేత యు.వీరబాబు, కిసాన్ సభ నేత తోట ఆంజనేయులు, ప్రగతిశీల రైతు సంఘం నేత ఎస్కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

వైద్యఖర్చులకు సీఎంఆర్ఎఫ్ సహాయం

పమిడిముక్కల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పేదవారికి ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిచేందుకు ముఖ్యమంత్రి ఆర్థికసాయం చేస్తున్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. హనుమంతపురం లో పోరంకి అనంతలక్ష్మికి వైద్యఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 2,50,100 చెక్కును శనివారం ఎమ్మెల్యే అందజేశారు. గ్రామంలో ఇప్పటివరకు 11మందికి రూ.30 లక్షల వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యఖర్చులకు సాయం అందించామని మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు అన్నారు. బి.మల్లికార్జునరావు, మోపిదేవి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి సహకరించాలి

● కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. శనివారం పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంగళ గిరికి విచ్చేసిన నితిన్ గడ్కరీకి ఆయన ఘనస్వాగతం పలికారు. గుడివాడ పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. తన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, సీఆర్ఐఎఫ్ సాంకేతిక అనుమతులతో త్వరలోనే పట్టణంలో రూ.8కోట్ల నిధులతో రహదారులు, డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించినున్నట్లు తెలిపారు. గుడివాడ-కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి గడ్కరీ, సహకరించిన ఎంపీ వల్లభనేని బాలశౌరిలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ధన్యవాదాలు తెలిపారు.



కేంద్రమంత్రి గడ్కరీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గడ్కరీ చిత్రపటానికి పాలాభిషేకం

గుడివాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రహదారుల, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని గుడివాడ ప్రాంత ప్రజలు ఎప్పటికి మరచిపోరని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ, టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె)లు అన్నారు. శనివారం తన వ్యక్తిగత కార్యాలయం వద్ద కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చిత్రపటానికి ఆర్కే పాలాభిషేకం నిర్వహించారు. శీలం వెంకట్రావు, గానుగుల రాజా, రాంబాబు, బోనం గోపిక, రీటా పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

నందివాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి మాట్లాడుతూ, వ్యవసాయ రైతులకు కావాల్సిన ఎరువులు, సబ్సిడీపై రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వీఆర్ పురం సర్పంచ్ కాకరాల సురేష్ మాట్లాడుతూ, ఫిల్టర్ బెడ్‌లు రిపేర్లు అంటు నామకార్థంగా పనులు చేసి మిగిన పనులు పంచాయతీ వారు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ తెలుపుతున్నారని, పంచాయతీలో డబ్బులు, వీధి లైట్లకు వివిధ పనులకే చాలటం లేదన్నారు. ఇంకా ఈ పనులు పంచాయతీ ఎక్కడ భరిస్తుందన్నారు. తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలలో జరగని పనులు, గ్రామాల అభివృద్ధికి కోట్లలో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, ఎంపీపీ పెయ్యల ఆదాం, వైస్ ఎంపీపీలు సుధాకర్, జయరాజు, ఎంపీడీవో మల్లేశ్వరి, డీటీ కిషోర్ పాల్గొన్నారు.



మండల సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

పేదరిక నిర్మూలన పీ 4 లక్ష్యం

గుడివాడ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేద వారిని గుర్తించి ఆ కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తయారు చేయడమే పీ4 సర్వే ఉద్దేశ్యమని పశుసంవర్ధక శాఖ జేడీ నరసింహులు అన్నారు. శనివారం లింగవరంలో పీ4 సర్వే నిర్వహించారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో జేడీ ప్రతి ఇంటికి తిరిగి వారికి ఆదాయ వనరులు, వారి కుటుంబాల్లో పిల్లలు ఏమీ చదువుకుంటున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గ్రామంలో పేదవారు ఆర్థికంగా పెరగటానికి ఉన్నత వర్గాల వారు సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి ప్రతీ ఇంటికి సర్వే నిర్వహించి ఎప్పటిప్పుడు రికార్డు రూపంలో అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ప్రతీ గ్రామపంచాయతీ కార్యదర్శి పీ4 సర్వే స్థితిగతులను తెలియజేయాలని కోరారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



లింగవరంలో పీ4 సర్వే చేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ నరసింహులు

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి

గుడివాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో బాపూజీనగర్‌లో శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ, పేదలు, దళితులు నివాస ప్రాంతాల్లో స్మార్ట్‌మీటర్లు బిగించడం వలన ప్రజలపై మరింత విద్యుత్ భారం పడుతుందన్నారు. ఈ నెల 5న స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ పేదలు భారీ ఎత్తున పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, రేపాని కొండ, వీరాబత్తిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

విద్యాశాఖ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

గుడివాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మినహా ఎవరికీ అనుమతి లేదంటూ విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. శనివారం కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది విద్యార్థుల సమస్యలను బయటకి రాకుండా నోరు నొక్కే ప్రయత్నమేనన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తర్వుల కాపీలను దగ్ధం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

యోగా శిక్షణతో విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం

పామర్రు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వానికి యోగా శిక్షణ తరగతులు దోహదపడతాయని ఏపీ ఆర్‌ఈఏ సొసైటీ అధ్యక్షుడు చొక్కా లింగం అన్నారు. నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాల, పాఠశాల విద్యార్థులకు శనివారం యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తొలగించడంలో యోగా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. వివేకానందుడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకుమారి, పాఠశాల ప్రధానాచార్యులు బ్రహ్మేశ్వరమ్మ, యోగా గురువు శైలేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం

అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాల్లో గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

గుడ్లవల్లేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో భాగంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత నిధులు విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని మరోమారు నిరూపించుకొందని వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాన్ని గుడివాడ నియోజకవర్గస్థాయిలో గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్ వేదికలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రావి మాట్లాడుతూ, రైతుపక్షపాతిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. గుడివాడ, గుడ్లవల్లేరు ఎంసీసీ చైర్మన్లు చాట్రగడ్డ రవి, పొట్లూరి రవికుమార్, జనసేన గుడివాడ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, డీసీ చైర్మన్లు కుటుంబరావు, పాలేటి అంజనేయిలు, యార్లగడ్డ రవి, బి.యేసుబాబు, సాయిన పుష్పావతి, జంగం మోహనరావు, కొడాలి రామరాజు, వి.మురళి, డి.సన్యాసిరావు, జి.సుబ్బారావు, కళ్యాణ్ కృష్ణ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో రైతులకు చెక్కు అందజేస్తున్న గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, పామర్రులో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు నియోజకవర్గంలో 29,680 మంది రైతులకు లబ్ధి

పామర్రు: రైతన్నలను రారాజుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 29,680మంది రైతులకు రూ. 19కోట్ల 96లక్షలు మొదటి విడతగా వారి ఖాతాలకు జమ చేశామన్నారు. ముందుగా వ్యవసాయ సంక్షేమ పథకాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు, ఏడీఏలు బి. స్వర్ణలత, ఎస్.శ్యామల, ఏవోలు శివనాగరాణి, గూడపాటి శ్రీదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, తహసీల్దార్ జి.రవికాంత్, ఐదు మండలాల రైతులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు ధాన్యాభిషేకం

పమిడిముక్కల: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటివిడత డబ్బు రైతు ఖాతాల్లో జమచేసిన సందర్భంగా వీరంకిలాకు పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ కోట వీరబాబు స్థానిక నాయకులతో కలసి ధాన్యంతో అభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ధాన్యంతో అభిషేకిస్తున్న కోట వీరబాబు

అవినీతి ఏ ప్రభుత్వంలో జరిగిందో ప్రజలకు తెలుసు

● మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆరోపణలు అవాస్తవం
● టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి

పెదపారుపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతి ఏ ప్రభుత్వంలో జరిగిందో పామర్రు నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి అన్నారు. టీడీపీ వెంట్రప్రగడ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ వెంట్రప్రగడలో మట్టి మాఫియా చెలరేగిపోతుందని టీడీపీ నాయకులపై అవాస్తవాలు మాట్లాడటం సరికాదన్నారు. నియోజకవర్గ ఎస్సీ విభాగం నాయకుడు దగాని లెనిన్ మాట్లాడుతూ, కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వెంట్రప్రగడలో మూడు చెరువులు, భూషణగుళ్ల, నాగాపురం చెరువుల్లోని మట్టిని అమ్ముకున్నారని ఆరోపించారు. నాగాపురంలో చెరువు భూమి కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే కైలే అవగాహన లేకుండా మాట్లడటం భావ్యం కాదని టీడీపీ మండల లీగల్ అడ్వయిజర్ గొరిపర్తి రవికుమార్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రహదారులు అధ్వానంగా ఉన్నా ఐదేళ్ల పట్టించుకోలేదని మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిలకా అంజనేయులు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామస్థాయి నుంచి ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మనిముక్కు రాంబాబు, పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు కలపాల కిషోర్, కూచిపూడి సుబ్బయ్య పాల్గొన్నారు.

సాగునీరు అందించి రైతులను ఆదుకోండి

● కౌలు రైతు సంఘ సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు

కూచిపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కృష్ణాజిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలువల్లో నీరు అడుగట్టడం వల్ల నారు వేసిన వరి పొలాలు ఎండిపోతుండగా, ఇంకా మొవ్వ మండలంలో నాట్లు వేయాల్సిన పొలాలు పదిశాతం ఉన్నాయని తెలిపారు. భీమనది ఛానల్ కింద వేములమడ, కుంపటివానిగూడెం గ్రామాల్లో పర్యటించి రైతులు పడుతున్న ఆగచాట్లు పరిశీలించారు. నాట్లు వేయని పొలాలను, రైతులతో కలసి పర్యటించారు. శొంఠి వీర ప్రకాశరావు, ఈడే అచ్చెయ్య, మురారి శివయ్య, బొల్లా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నీళ్లు లేక అడుగంటిన పొలాలు, నాట్లు వేయని పొలాలను పరిశీలిస్తున్న శీలం నారాయణరావు

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

కూచిపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వగ్రామమైన భట్లపెనుమర్రులో ఆయన జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పింగళి గొప్ప దేశభక్తుడని, స్వాతంత్ర్య సమయరయోధునిగా ఆయన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ మట్టా ఇందిర, ఈవో ప్రభుకుమార్, సంగిశెట్టి సాంబశివరావు, చందు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ: స్థానిక స్లేటర్‌పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, ఉమ్మడి జిల్లాల సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, దండమూడి జయలక్ష్మి, గుడివాడ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, జిల్లా కోశాధికారి అన్నపురెడ్డి గోపిరెడ్డి, ఘంటసాల రామకృష్ణ, గుడివాడ కోశాధికారి బి.రాధాకృష్ణ, మోహనరావు, సామి రామ్మోహన్‌రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



భట్లపెనుమర్రులో పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు

గుడివాడ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రపటానికి ఎంపీడీవో విష్ణుప్రసాద్ నివాళులర్పించారు. పింగళి వెంకయ్య జాతీయ జెండా రూపకల్పన చేయటం అనిర్వచనీయమని, మన జిల్లా వాసి కావటం మన అదృష్టమన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ సీఎల్ వెంకట్రావు సేవలు అభినందనీయం

గుడ్లవల్లేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో జన్మభూమి మెడికల్ సెంటర్ ఏర్పాటు చేసి పేదలకు ప్రతీ నెలా మొదటి శని, ఆదివారాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావు అభినందనీయుడని తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివ రామకృష్ణ(చంటి) అన్నారు. శనివారం గుడ్లవల్లేరులో డాక్టర్ సీఎల్ వెంకట్రావు నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో పాల్గొని సీఎల్‌ను సన్మానించారు. శనివారం సీఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్లో ఉచిత దంతవైద్య పరీక్షలను ఏలూరు దంత వైద్యకళాశాల వైద్యుల బృందం నిర్వహించగా, సాధారణ వైద్యం, గ్యాస్ట్రో ఎంట్రాలజీకి డాక్టర్ సీఎల్ వెంకట్రావు వైద్యసేవలందించారు.ఆదివారం కూడా వైద్య శిబిరం కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

అమీనాపురంలో 115 మందికి వైద్యపరీక్షలు

పమిడిముక్కల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అమీనాపురంలో ఉయ్యూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 115 మందికి నేత్ర, దంత, ఇతర వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నేత్ర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించిన వారికి ఉయ్యూరు రోటరీ నేత్రవైద్యశాలలో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారని క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం తెలిపారు. డాక్టర్ జగన్నాధరాజు, వరలక్ష్మి, సరిత, సిబ్బంది వైద్యసేవలందించారు. క్లబ్ కార్యదర్శి అమీర్ మీర్జా, కేసీపీ మేనేజర్ రామచంద్రరావు సేవలందించారు.

ఆన్‌లైన్‌లో మస్తర్లు వేయాలి

గుడివాడ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో మస్తర్లు వేయాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ తెలిపారు. శనివారం గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ ఫేస్ రికగ్నజింగ్ హాజరు వేయాలని సూచించారు.



పెదమద్దాలిలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది

ముర్రుపాలు అమృతంతో సమానం

పామర్రు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలు అమృతంతో సమానమని బిడ్డ జన్మించిన గంట లోపు తప్పనిసరిగా తాగించాలని సీడీపీవో భానుశ్రీ సూచించారు. పెదమద్దాలి పంక్షన్ హాల్లో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పామర్రు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు. ముదుగా పదోన్నతిపై గుంటూరు జిల్లా స్త్రీ శిశు సంక్షేమాదికారిగా వెళ్తున్న భానుశ్రీని దుశ్శాలువాలతో సిబ్బంది ఘనంగా సత్కరించారు.

బిళ్లపాడులో..

గుడివాడ రూరల్ : బిళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. సీడీపీవో విజయ ఫ్లోరెన్స్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూరున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ : నందివాడ-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఏసీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగశిరీష, అంగన్‌వాడీ కార్యకర్త రాజరాజేశ్వరీ, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుర్వాసన వెదజల్లుతున్న రజక చెరువు

గుడ్లవల్లేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మామిడికోళ్ల పంచాయితీ పెసరమిల్లి రజక సొసైటీ చెరువులో చేపలు మృతి చెంది పైకి తేలి నీరు కలిషితమై దుర్గంధం వ్యాపిస్తుంది. అంతేకాక గ్రామంలోని పశువులు ఆ చెరువులో నీరు తాగి అనారోగ్యానికి గురైయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పంచాయితీ కార్యదర్శి దాసరి భాగ్యరాజుని చెరువు విషయమై ప్రశ్నించగా చెరువు లీజుదారులు చేపలకు పేలమందు కొట్టామని, నీటిని శ్యాంపిల్ తీసి పరీక్షలకు పంపామని తెలిపారు.



చెరువులో తేలిన చేపలు

సంత బజారులో సర్వే

గుడ్లవల్లేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని ఆర్ అండ్ బీ, సంతబజార్, ప్రధాన వీధుల్లో ఆక్రమణలను తొలిగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొనరాజు బాపయ్య చౌదరి ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. శనివారం గ్రామంలో మండల సర్వేయర్ల బృందం పంచాయితీ, ఆర్ అండ్ బీ స్థలాల హద్దులను గుర్తించి మార్కింగ్ చేశారు. ప్రధాన కూడలి నుంచి సర్వేయర్ల బృందం సర్వే నిర్వహించి మార్కింగ్ ఇచ్చారు. తొలుత ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి మార్కింగ్ చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. రెండవ దశలో ఆక్రమించిన వారికి ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. గుడ్లవల్లేరు ఎంపీడీవో ఇమ్రాన్, ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, మండల సర్వేయర్ ప్రవీణ బృందం పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 105, 113, 124
చికెన్ విత్ స్కిన్ 200
చికెన్ స్కిన్‌లెస్ 210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

పెడన, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఈ ఏడాది జూలై 25 నుంచి 90 రోజులలోపు ఆన్‌లైన్‌లో ఐఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం పీనలైజేషన్ చార్జీలు, 14 శాతం మార్కెట్ వాల్యూ చార్జీలు కట్టించుకుని అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరిస్తామని కమిషనర్ తెలిపారు.

బాలికల బంగారు భవిష్యత్‌కు సుకన్య పథకం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శర్మిష్ఠ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బాలికల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు తమ పిల్లల పేరిట పోస్టాఫీసులో సుకన్య సంవృద్ధియోజన అకౌంట్ ప్రారంభించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శర్మిష్ఠ సూచించారు. సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో శనివారం ఆమె భవిష్యత్ మన బాధ్యత కార్యక్రమాన్ని శర్మిష్ఠ ప్రారంభించారు. ఈనెల 15 లోగా జిల్లాలోని 607 గ్రామాల్లోని వివిధ పాఠశాలల్లో బాలికలకు సుకన్య సంవృద్ధి యోజన అకౌంట్ ప్రారంభిస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రిన్సిపాల్ సీబీ ఆంథోని, ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్ మాట్లాడారు.

యూరియా, డీఏపీ తగినంత సరఫరా చేయాలి

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు పూర్తిస్థాయిలో యూరియా, డీఏపీ సరఫరా చేయాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పురిటిగడ్డ సొసైటీని శనివారం ఆయన సందర్శించి యూరియా, డీఏపీ నిల్వలు, పంపిణీపై ఆరా తీశారు. స్టాకు తక్కువగా ఉండడం వల్ల ఎకరాకు అరబస్తా చొప్పున యూరియాను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. సోమ, మంగళవారాల్లో మరోసారి లోడు వస్తుందని రాగానే అందరికీ ఇస్తామన్నారు. నాట్లు ఒకేసారి వేస్తుండటంతో కొరత వచ్చినట్లు తెలిపారు. ఎకరానికి బస్తా యూరియా అవసరం అవుతుందని, విడతల వారీగా నాట్లు వేయాలని రైతులకు చెప్పగలమా అని కార్యదర్శిని సింహాద్రి ప్రశ్నించారు. అవనిగడ్డ జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, నడకుదురు, పులిగడ్డ సర్పంచ్‌లు గొరిపర్తి సురేష్, దాసరి విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరగాలి

మోపిదేవి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు స్థాయికి ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం బొబ్బర్లంకలో జిల్లా ఉద్యాన శాఖ, 3 ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మేళా-2025ను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలో నూతనంగా సాగు చేపట్టిన రైతు మత్తి కృష్ణారావుకు చెందిన రెండెకరాల భూమిలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. జిల్లా ఉద్యానశాఖ అధికారిణి జె.జ్యోతి, ఉద్యానవన శాఖ అధికారి రమేష్, జోనల్ మేనేజర్ విక్రం, సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, రావి నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు.

వేమూరి రామకృష్ణ మరణం తీరని లోటు

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



వేమూరి రామకృష్ణారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా, కళాభిమానిగా, బ్రాహ్మణ సంఘ నాయకుడిగా పలు సేవలు అందించిన వేమూరి రామకృష్ణారావు మృతి తీరని లోటని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. శనివారం వేమూరి రామకృష్ణ భౌతికకాయానికి ఆయన నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, ఆడిటర్ శివరామ్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, జనసేన నాయకుడు మాదివాడ రాము, టీడీపీ నాయకులు పీవీ ఫణికుమార్, మాదిరెడ్డి మెహర్ బాబా, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, గుమ్మడి విద్యాసాగర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు అందాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఏవీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం పెన్షనర్ల హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. '70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ ఇవ్వాలి. ఏడు శాతాన్ని పది శాతానికి, 12 శాతాన్ని 15 శాతానికి పెంచాలి. పీఆర్సీని వర్తింపజేయాలి. డీఏ బకాయిలు చెల్లించాలి.' అని డిమాండ్ చేశారు. రామస్వామి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వి.సుబ్బారావు, శంకరనాథ్, ఎంఎస్ శాస్త్రి మాట్లాడారు.

ఆందోళన చెందొద్దు..సాగునీరు అందిస్తాం

● రైతులతో ఇరిగేషన్ ఈఈ రవికిరణ్

కోడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆందోళన చెందవద్దని సకాలంలో సాగునీరు అందిస్తామని రైతులకు ఇరిగేషన్ ఈఈ రావెళ్ల రవికిరణ్ భరోసా ఇచ్చారు. శనివారం మండలంలో ఆయన పర్యటించి సాగునీటి సరఫరాను పరిశీలించారు. కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ గణపతి, ఏఈ విజయ్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య, స్థానిక నీటి సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లకు జరిమానా

కోడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. శుక్రవారం రాత్రి కోడూరులో ట్రాక్టర్లను అడ్డుకుని తోలకాలను నిలిపివేశామన్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.2 వేలు చొప్పున నాలుగు ట్రాక్టర్లకు రూ.8 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

హోంగార్డులకు కంటి వైద్యపరీక్షలు

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్రైవింగ్ విధుల్లో ఉన్న హోంగార్డులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. శనివారం పోలీస్ వెల్ఫేర్ ఆస్పత్రిలో ఎస్పీ ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. హోంగార్డుల దృష్టి సామర్థ్యాన్ని పరీక్షించి, అవసరమైన వారికి చికిత్స లేదా కళ్లజోళ్లను సూచించినట్లు తెలిపారు.

కొల్లూరి చిన్నాకు వైశ్యరత్న అవార్డు

పెడన, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైశ్యరత్న అవార్డుకు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) ఎంపికయ్యారు. ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా పేదలకు చిన్నా అందిస్తున్న సేవలకుగానూ హైదరాబాద్‌కు చెందిన హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీసు సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చిన్నా ఈ అవార్డు అందుకుంటారు.

పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ చదువుకుంటున్న పేద విద్యార్థి దామోదర లోకేశ్‌కు శనివారం బెరాకా సంస్థ ల్యాప్‌టాప్‌ను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెపాటి గోపీచంద్ చేతుల మీదుగా అందించింది. 50వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



బంటుమిల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మోపిదేవి సెంటర్‌లో విజయోత్సవాలు చేస్తున్న కూటమి నేతలు



చిన్నాపురం పొలాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

రైతు సంక్షేమమే ధ్యేయం

● అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్

అవనిగడ్డ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం రెవెన్యూ హాలులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం మొదటి విడత నిధుల విడుదల ప్రారంభ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా 29,718 మంది రైతులకు రూ.20 కోట్ల 80 లక్షల 26 వేలు లబ్ధి చేకూరిందని తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవిలో బాణాసంచా కాల్చిన రైతులు

మోపిదేవి: మోపిదేవిలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు బాణాసంచా కాల్చి, జయహో చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, నేతలు బొబ్బా గోవర్ధన్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నడకుదురు జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, కడవకొల్లు సీతారామాంజనేయులు, గవిని శివరామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, రావి రత్నగిరి, మోర్ల జయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు ధాన్యాభిషేకం



పెనుమల్లిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్

పెడన రూరల్: అన్నదాత సుఖీభవ తొలి విడత నిధులు ఖాతాల్లో జమ అయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పెనుమల్లి సచివాలయంలో రైతులు ధాన్యాభిషేకం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, జనసేన మండల అధ్యక్షుడు ఊచ వెంకయ్య, వీఆర్వో శ్రీనివాస్, పాల్గొన్నారు.

మండలంలో 5,600 మందికి లబ్ధి

నాగాయలంక: మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి నిధులు జమ చేసే కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ఇచ్చారు. మండలంలోని 5600 మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరిందని ఏవో సంజీవ్‌కుమార్ తెలిపారు.

రైతు పక్షపాతి చంద్రబాబు

ఘంటసాల: నిధుల విడుదల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాలను తాడేపల్లి రైతు సేవా కేంద్రం వద్ద టీవీల్లో టీడీపీ నేతలు తుమ్మల చౌదరి, పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) వీక్షించారు. మండలంలో 5510 మంది రైతులకు రూ.3,75,70,000 లబ్ధి చేకూరిందన్నారు.

రైతుల ఖాతాలో రూ.4.14 కోట్లు జమ

కోడూరు: మండలంలో 6314 రైతు కుటుంబాలకు రూ.4.14 కోట్ల రూపాయలు జమ చేశామని ఏవో ఎం.శ్రీధర్ తెలిపారు. రైతుసేవా కేంద్రంలోనిధులు జమ చేసే కార్యక్రమాన్ని రైతులకు లైవ్ చూపించారు.

పెడన నియోజకవర్గంలో రూ.16.14 కోట్లు లబ్ధి

బంటుమిల్లి: మల్లేశ్వరం మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలను నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. నియోజకవర్గంలో రూ.16.14 కోట్లు నేరుగా 44,383 మంది రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, యిల్లూరి లీలాకృష్ణ, ర్యాలీ సత్యనారాయణ, సుజ్ఞానం సతీష్, అడ్వకేట్ గంగరాజు, ఎండీ నూర్, నజీర్, భూపతి రమేష్, వక్కలగడ్డ కరుణకుమార్, జోగి నళిని, కార్యదర్శి రామకృష్ణ, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

చిన్నాపురంలో..

మచిలీపట్నం టౌన్: అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ చేసినందుకు కృతజ్ఞతగా చిన్నాపురంలో పొలాల్లో రైతులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగుజాతికి గర్వకారణమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం గాంధీక్షేత్రంలో పింగళి జయంతి వేడుకలు నిర్వహించారు. వెంకయ్య విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, నాయకులు యలవర్తి నాగరాజ మునేశ్వరరావు(చిన్నా), శోభిల ఏడుకొండలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతిని పార్టీ నేతలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, పరుచూరి దుర్గా ప్రసాద్, మండలి రామ్మోహనరావు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పింగళి చిత్రపటానికి నివాళులర్పించారు.

చల్లపల్లి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో..

చల్లపల్లి: జడ్పీహైస్కూల్ ప్రాంగణంలోని వెంకయ్య విగ్రహానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న నివాళులర్పించారు. కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై గ్రామసభ

నాగాయలంక, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టి.కొత్తపాలెం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ జరిగింది. ఈ ఏడాది జనవరి 20న టి.కొత్తపాలెంలో గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సరిహద్దులు, రైతువారీ భూములను ఆధునాతన పరికరాలతో సర్వే చేసి ఆ జాబితాను ఆన్‌లైన్‌లో జిల్లా అధికారులకు పంపారు. రీ సర్వేలో పూర్తయిన జాబితాను ఈ రోజు గ్రామసభలో చదివి వినిపించగా, రైతులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, రీ సర్వే డీటీ సీహెచ్ శ్రీనివాసరావు, సర్వేయర్ డి.సుధీర్‌బాబు, టీజీఎస్ సాయిబాబు, ఎం.అజయ్‌బాబు, ఎస్.చైతన్యవర్మ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ముమ్మనేని నాని



చల్లపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్కే నగర్ అధ్యక్షుడిగా గ్రామ ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వరదా హరిగోపాల్, కోశాధికారిగా నర్రా సాయిబాబు, ఉపాధ్యక్షులుగా ఏఎల్‌ఆర్కే ప్రసాద్, పరిసి జలంధర్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఉప్పల సాంబశివరావు, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా కొల్లిపర మధు, ఎల్‌సీఐఎఫ్ కో ఆర్డినేటర్‌గా రాయపాటి రాధాకృష్ణ, అనుబంధ విభాగాల చైర్‌పర్సన్లుగా కంఠంనేని సుధాకరరావు, అరజా నాగశ్రీనివాసరావు, వేమూరి మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఏడుగురు సీనియర్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు. నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం రాత్రి శారదా గ్రాండియర్ హాలులో నిర్వహించనున్నారు.

పాడిరైతు కుటుంబానికి క్షీరబంధు అందజేత

ఘంటసాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యుడు దేవినేని రామ్మోహనరావు ఇటీవల మృతి చెందారు. కృష్ణా మిల్క్ యూనియన్ అమలు చేస్తున్న క్షీరబంధు పథకం కింద కుటుంబసభ్యులను మంజూరైన రూ.50 వేలను యూనియన్ పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకట రమణ శనివారం అందజేశారు. సంఘ అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్, పామర్రు పాలశీతలీకరణ మేనేజర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఘంటసాల/పెడన/పెడన రూరల్/గూడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఘంటసాల సీహెచ్‌వో వై.అనురాధ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి-1 అంగన్వాడీ కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంట లోపే ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ఎంపీహెచ్‌ఈవో టీబీ భాస్కరరావు, ఏఎన్ఎం ఆర్.జ్యోతి, అంగన్వాడీ కార్యకర్త జె.రాజ్యలక్ష్మి, పి.నాగలక్ష్మి, కె.రాణి పాల్గొన్నారు. పెడన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 5వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి, వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, బాబూలాల్ పాల్గొన్నారు. పెడన మండలంలో కాకర్లమూడిపాలెం, లంకలకలవగుంట, గురివిందగుంట, కొంగంచర్ల, కమలాపురం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భవతులకు అవగాహనా సదస్సులు నిర్వహించారు. సర్పంచ్ పరసా లక్ష్మీకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి పాల్గొన్నారు. గూడూరు మండలం ఆకులమన్నాడు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సీహెచ్‌వో డాలి సుకన్య, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో క్రీడాకారులకు పోటీలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 6,7 తేదీల్లో మచిలీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో 10 రకాల పోటీలు జరుగుతాయని, 22 ఏళ్ల లోపు పురుషులు, స్త్రీలు పాల్గొనవచ్చని జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఝాన్సీలక్ష్మి తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల మెమో తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 73309 07945కు ఫోన్ చేయవచ్చన్నారు.

విద్యార్థుల దుస్తులు కుట్టే ఏజెన్సీలకు ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు 2,500 జతల యూనిఫాం కుట్టడానికి ఆసక్తి గల ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నామని జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. జతకు రూ.80 కుట్టు కూలీ ఇస్తామని, ఈనెల 11న మధ్యాహ్నం 3 గంటలకు తమ కొటేషన్లతో బీసీ సం క్షేమ శాఖ కార్యాలయానికి హాజరు కావాలని ఆమె సూచించారు. వివరాలకు 92990 04162కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

నూరుశాతం అక్షరాస్యత లక్ష్యం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 73,237 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు అక్షరాస్యత సేవ అనే నినాదంతో విల్లాస్ ఫేజ్ 2 కార్యక్రమం చేపట్టినట్టు వయోజన విద్య ఉపసంచాలకులు ఎండీ హాజీబేగ్ తెలిపారు. 2027 నాటికి నూరుశాతం అక్షరాస్యత అందించాలనే లక్ష్యంతో పొదుపు సంఘాల మహిళలు, ఎన్ఆర్ఈజీఎస్ లబ్ధిదారులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశామన్నారు. జిల్లాలో 25 రూరల్ మండలాల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి మండలంలో 2300 మందిని అక్షరాస్యులను చేస్తున్నామన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో 3700, మిగిలిన నాలుగు మునిసిపాలిటీల్లో 2300 మంది నిరక్షరాస్యులున్నారన్నారు.

గోదాదేవికి వెండి కిరీటం బహూకరణ

గూడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని వేంకటాచల స్వామి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారికి శనివారం డీసీ మాజీ చైర్మన్ గమిని కృష్ణ, ఆయన సతీమణి జ్ఞానశివనాగప్రసూనాంబ వెండి కిరీటాన్ని బహూకరించారు. వేంకటాచలస్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

విత్తనోత్పత్తిపై ముగిసిన శిక్షణ

ఘంటసాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులే నాణ్యమైన వరి విత్తనాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చునని కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో వరిలో నాణ్యమైన విత్తనోత్పత్తిపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ శనివారంతో ముగిసింది. నాణ్యమైన విత్తనోత్పత్తి వల్ల ఎన్నో ప్రయోజనాలు కలవని తెలిపారు. సీడ్ కోసం ఇతరులపై ఆధారపడకుండా ఉండటం, మంచి విత్తనాలను విక్రయించటం ద్వారా వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చునని తెలిపారు. శిక్షణ పొందిన గ్రామీణ యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి తదితరులు పాల్గొన్నారు.